# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 18-9-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 45 | పేజీలు 8 | వెల: రూ.1/-


## ప్రధాని మోడీకి కెసిఆర్ జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా సీఎం ప్రత్యేక సందేశం పంపించారు. మోడీ దేశానికి మరిన్ని సంవత్సరాల పాటు సేవలందించాలని కేసీఆర్ ఆకాంక్షించారు.మోదీ ఎక్కువకాలం బతికేందుకుగాను భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు సీఎం సందేశంలో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ 69వ పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. ప్రధాని మోడి పుట్టిన రోజు సంధర్భంగా సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. 69వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ప్రధాని మోడీ స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లో పర్యటిస్తున్నారు. ఈ సంధర్భంగా ఉదయమే తన తల్లి దీవేనలు అందుకున్నారు. అనంతరం సర్దార్ పటేల్ విగ్రహాన్ని సందర్శించారు. ఇక్కడి నుండి సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్ సమీపంలో ఉన్న జంగిల్ సఫారీ పార్క్‌కు వెళ్లారు. పటేల్ విగ్రహానికి వెళ్లే ముందు హెలికాప్టర్ నుండి వీడియో తీశారు. దాన్ని ట్విట్టర్‌లో పోస్టు చేశారు.అందమైన ప్రదేశాన్ని మీరు కూడ చూడాలంటూ తన అభిమానులకు పిలుపునిచ్చారు ప్రధాని మోడీ, ఈ రోజంతా ఆయన గుజరాత్‌లోనే గడపనున్నారు.



విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లో జెండా ఆవిష్కరించిన మంత్రి కెటిఆర్

# పార్టీల పరంగా తెలంగాణ విమోచనోత్సవాలు

### తెలంగాణ భవన్‌లో జెండా ఎగురేసిన కెటిఆర్
### అధికారికంగా ఉత్సవాలకు దూరంగా ప్రభుత్వం

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): భారత విముక్తికి ఓ ఏడాది ఆలస్యంగా తెలంగాణ విమోచన జరిగినా నేటికీ వివాదాలు సద్దుమ ణగడం లేదు. ఏటా దీనిపై పెద్ద రాద్ధాంతమే జరుగుతోంది. అధికారంలో ఎవరు ఉన్నా విమోచనోత్సవాలను జరపక పోవడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. అయితే ఓటు బ్యాంక్ రాజకీయాలకు ఇది ఓ అస్త్రంగా మారింది. ఈ యేడు కూడా విమర్శలను అధికార టిఆర్ఎస్ పట్టించుకోక పోవడంతో పార్టీల పరంగానే తెలంగాణలో విమోచనోత్సవాలను నిర్వహించారు. బిజెపి, కాంగ్రెస్, సిపిఐ,అధికార టిఆర్ఎస్ తదితర పార్టీలు తమ పార్టీ కార్యాలయాల్లో జెండా ఎగురేసి విమోచనోత్సవాలను నిర్వహించారు. ఆయా పార్టీలు తెలంగాణ విమోచనపై కార్యక్రమాలు నిర్వహించాయి. గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. టిఆర్ఎస్‌లో కెటిఆర్, బిజెపిలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తెలంగాణలో ప్రతి ఏడాది సెప్టెంబరు 17 వస్తోందంటే చాలు మూడునాలుగు నెలల ముందు నుంచే విమోచన దినం జరపాలంటూ ఆందోళనలు మొదలవుతాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక తాను స్వతంత్రంగా ఉంటానని లేదా పాకిస్తాన్‌లో కలుస్తానని, ఇండియన్ యూనియన్‌లో కలవనని హైదరాబాద్ నిజాం ప్రభువు మొండికేసిన విషయం తెలిసిందే. అయితే సంస్థానాలను విలీనం చేస్తూ వచ్చిన ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నిజాంపై సైనిక చర్యకు దిగి దారికి తెచ్చారు. నిజాం రాష్ట్రంపై పోలీసు చర్య తీసుకొని దాన్ని 1948 సెప్టెంబరు 17న ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశారు. దీంతో నియంతృత్వ, దుష్ట పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగింది. సాయుధ రైతాంగ పోరాటానికి ఫలితం దక్కింది. దాన్నే తెలంగాణ విమోచన దినం అంటున్నాం. ఆ తరవాత ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ యూనియన్ విలీనం అయ్యాక ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో సిఎంలుగా ఉన్న ఆంధ్రా ముఖ్యమంత్రుల ప్రభుత్వాలు దీనిని పట్టించుకోలేదు. దీంతో తెలంగాణ ఉద్యమం నిర్వహిస్తున్నప్పుడు కేసీఆర్ విమోచన దినం నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విమోచనోత్సవాలను జరపాలని టిఆర్ఎస్ అధినేతగా డిమాండ్ చేసిన కెసిఆర్, సొంత రాష్ట్రం ఏర్పడి సిఎం అయినాక కూడా గత పాలకుల విధానాలనే అనుసరిస్తూ వస్తున్నారు. అందుకే విమోచనోత్సవాలను జరపడం లేదు.తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న వేళ విమోచనం దినం ప్రభుత్వమే నిర్వహించాలని కెసిఆర్ గట్టిగా డిమాండ్ చేశారు. కర్నాటక, మహారాష్ట్రల్లో నిర్వహిస్తున్నప్పుడు ఇక్కడ ఎందుకు నిర్వహించరని అన్నారు. అయితే ఆనాడు డిమాండ్ చేసిన మాట నిజవే అయినా, అప్పటి పరిస్థితులు, కారణాలు వేరని వాదిస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఇప్పుడు విమోచన దినానికి ప్రాధాన్యం లేదన్న భావనలో సిఎం కెసిఆర్ ఉన్నారు.తెలంగాణ విమోచన దినం అధికారికంగా నిర్వహించాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి కెసిఆర్ కుండ బద్దలు కొట్టినట్లుగా చెప్పేశారు. ఉద్యమ సమయంలోనే ఓ పక్క విమోచన దినం నిర్వహించాలని డిమాండ్ చేసిన కేసీఆర్ నిజాంను, ఆయన పరిపాలనను గొప్పగా ప్రశంసించారు. బ్రిటిష్ వాళ్లను పొగిడినప్పుడు నిజాంను పొగడడంలో తప్పులేదని వాదిస్తూ వస్తున్నారు. నిజాంను ప్రశంసి ంచిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో విమోచన దినం నిర్వహించాలని డిమాండ్ చేసింది రాజకీయ ప్రయోజనాల కోసమే అన్నది ఎవరినడిగినా చెబుతారు. అయితే నిజాంను పొగుడుతూ విమోచనదినం పక్కన పెట్టిన సిఎం కేసీఆర్ నిజాం మీద పోరాడిన వీరుల, కవుల, రచయితల జయంతులు, వర్ధంతులు ఘనంగా, అధికారికంగా నిర్వహిస్తున్నారు. కొమురం భీమ్, చాకలి ఐలమ్మ, దాశరథి, కాళోజీ, వట్టికోట ఆళ్వారుస్వామిలాంటి వారిని ఎందరినో స్మరించుకుంటూ ఘనంగా గౌరవిస్తున్నారు. నిజాం మీద పోరాడినందుకు వారిని గౌరవించడం అన్న విషయం తెలియకుండా వారిని తెలంగాణ వైతాళికులుగా కీర్తిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ బిడ్డలకు గౌరవం దక్కలేదని, ప్రత్యేక తెలంగాణలో వీరిని గౌరవించడం ధర్మమని చెబుతున్నారు. కాళోజీ జన్మదిన సెప్టెంబరు 9వ తేదీని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

### పోడు భూములపై..
# త్వరలో కొత్త పాలసీ తెస్తాం

- రైతుబంధు, రైతు బీమా పథకాల్లో ఎలాంటి మార్పులుండవు
- గుంట భూమి ఉన్నా రైతుబంధు వర్తిస్తుంది
- ఖరీఫ్‌లో రైతుబంధు రానివారికి త్వరలో అందజేస్తాం
- కేంద్ర కిసాన్ సమ్మాన్ యోజనతో రైతులకు మేలు జరగదు
- అసెంబ్లీలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ) : పోడు భూములపై త్వరలో కొత్త పాలసీ తీసుకొస్తామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రైతుబంధు, రైతు బీమా పథకాల్లో ఎలాంటి మార్పులు ఉండవని అన్నారు. ఖరీఫ్‌లో రైతుబంధు రానివారికి త్వరలో అందజేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రైతుబంధు పథకం కింద ఈ ఏడాది 56.76 లక్షల మంది రైతులు అర్హులుగా ఉన్నారని తెలిపారు.

ఇప్పటి వరకు రూ. 39.72 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని, మిగిలిన రైతులకు చెల్లింపులు ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. గతేడాది రైతుబంధు పథకం కింద రూ.10,505 కోట్లు చెల్లించామని అన్నారు. ఎకరానికి పంటకు రూ.5 వేల చొప్పున రెండు పంటలకు రూ.10వేలు ఇస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద అనేక రకాల షరతులు ఉన్నాయని మంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా రూ.6 వేలు.. మూడు సార్లు ఇస్తారని, కిసాన్ సమ్మాన్ యోజన కింద రాష్ట్రంలోని 33 లక్షల మంది రైతులను అర్హులుగా నిర్ణయించారన్నారు. కానీ 75 వేల మంది రైతులకు రూ. 125 కోట్లు మాత్రమే కేంద్రం ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకంలో షరతుల్లేవని, రాష్ట్రంలో గుంట భూమి ఉన్నా కూడా ఈ పథకం వర్తిస్తోంద మంత్రి స్పష్టం చేశారు. గతేడాది రైతుబంధు పథకం కింద రూ.10,505 కోట్లు చెల్లించామని, రాష్ట్రంలో 92 శాతం మంది సన్న, చిన్నకారు రైతులు ఉన్నారన్నారు. వీరిలో మెజార్టీ రైతులు ఆసరా పెన్షన్లకు కూడా అర్హులుగా ఉన్నారని, ఐదు ఎకరాల భూమి ఉంటే రూ. 50 వేలు వస్తున్నాయని, ఆసరా పెన్షన్ కింద 25 వేల దాకా వస్తున్నాయని, దీంతో ఒక్కో రైతుకు సంవత్సరానికి రూ.75 వేలు చెల్లిస్తున్నాం మంత్రి తెలిపారు.

## అంగన్‌వాడీ టీచర్ల..
# సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- దేశంలో మన అంగన్‌వాడీలను ఉన్నతస్థాయిలో నిలిపేలా పనిచేయాలి
- పిల్లలను సొంతబిడ్డల్లా చూసుకోవాలి
- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్, సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ) : అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని గిరిజన, మహిళా- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం మంత్రికి విన్నవించారు. ఈసందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యను త్వరలో పరిష్కరించే ప్రయత్నం చేస్తానని, అప్పటి వరకు అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలను సొంత బిడ్డల్లాగా చూసుకోవాలని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ మహిళలకు మన రాష్ట్రంలో పథకాలు పెట్టి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఏ రాష్ట్రంలో లేని విధంగా వేతనాలు, వసతులు కల్పిస్తున్నారని చెప్పారు. మన మహిళలకు ఇంతటి ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి ఆ శాఖలో మనం బాగా పనిచేసి పేరు తీసుకొచ్చే విధంగా, దేశంలో మన అంగన్‌వాడీలను ఉన్నత స్థానంలో నిలిపే విధంగా పనిచేయాలని సూచించారు. అందరివలె బొకేలతో రాకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పుస్తకాలు, పెన్నులు తీసుకురావడం పట్ల మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ వారిని అభినందించారు. తన వద్దకు వచ్చేవారు బొకేలు కాకుండా, విద్యార్ధులకి ఉపయోగపడే పుస్తకాలు, నోట్ బుక్స్, బాగ్స్, పెన్నులు-పెన్సిళ్లు, గిరిజన హాస్టల్ విద్యార్థులకు ఉపయోగపడే దోమ తెరలు, దుప్పట్లు, ఇతర విద్యా సంబంధ వస్తువులు తీసుకురావాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో తెలంగాణ రాష్ట్ర మినీ అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, సౌజన్యం, సౌమ్య ఇతర అంగన్‌వాడీ టీచర్‌లు ఉన్నారు.

## గిరిజనులకు అన్యాయం జరగనివ్వం

### నాలుగేళ్లలో 174కోట్ల మొక్కలు నాటాం
### - అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): అడవుల రక్షణకు చర్యలు తీసుకుంటేనే అడవిబిడ్డలకు సర్కార్ అండగా నిలుస్తోందని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టం చేశారు. గిరిజనులకు తమ ప్రభుత్వం పూర్తి అండగా ఉందన్నారు. ఇకపోతే రాష్ట్రంలో నాలుగేళ్లలో 230కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 174.704 కోట్ల మొక్కలు నాటామని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా హరితహారంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. అడవుల్లో 20కోట్ల మొక్కలను లక్ష్యంగా 16 కోట్ల మొక్కలు నాటామన్నారు. అటవీ ప్రాంతం వెలుపలి భాగంలో 125 కోట్ల మొక్కలు నాటడం జరిగిందని మంత్రి తెలిపారు. జీహెచ ఎంసీలో 2 కోట్లు, హెచ్ఎండీఏ పరిధిలో 3 కోట్ల మొక్కలు నాటడం జరిగిందన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 59 ఉద్యానవనాల అభివృద్ధి చేశామని, రాష్ట్రంలో పచ్చదనం 24 నుంచి 33 శాతానికి చేర్చడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. హరితహారానికి ఇప్పటి వరకు రూ. 3,765 కోట్ల ఖర్చుపెట్టామని, క్షీణించిన అడవుల పునరుజ్జీవన చర్యలు చేపడుతున్నామని అన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. అయితే పోడును నమ్ముకుని బుతుకున్న గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని కాంగ్రెస్ సభ్యురాలు సీతక్క ఆవేదన చెందారు. అడవిని నమ్ముకుని బతుకుతున్న అడవిబిడ్డలకు రక్షణ కల్పించాలన్నారు.

## కొత్త ఓటర్ల నమోదు చేయించాలి: బివి

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం ఐక్యంగా పని చేయాలని జనగామ జిల్లా కార్యకర్తలతో ఎమెల్సీ,మండలి చీఫ్‌విప్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ ముఖ్య నాయకులు కొందరు ఆయనను కలసినప్పుడు పార్టీ గెలుపుపై సూచనలు చేవారు. సీఎం కేసీఆర్ అదేశాలమెరకు యువ ఒటర్లను నమోదుచేయించాలని కోరారు. అదేవిధంగా ఓటర్లజాబితాలో తప్పు ఒప్పులను సరిదిద్దాలని దీనిలో గ్రామాల్లోని నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. అదేవిధంగా బూత్‌లెవల్‌లో ఐదుగురుని నియమించుకోవాలని సూచించారు. పదవీకాలంలో చేసిన పనులు,ప్రభుత్వ సంక్షేమ పథకాలే మళ్లి గెలిపిస్తాయని ఎవరూ అధైర్యపడొద్దని చెప్పారు.

# కాళేశ్వరంపై ఇంకా ఆగని కుట్రలు

### కన్నీళ్లు పెట్టుకుంటున్న కాంగ్రెస్ వారు: కర్నె

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకుంటున్నామని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. కాళేశ్వరం పూర్తయినా ఇంకా కాంగ్రెస ఆటంకాలు సృష్టిస్తూనే ఉందని, అప్పులంటూ గగ్గోలు పెడుతోందని మండిపడ్డారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలోనే తెలంగాణ ఒక్కటేనన్నారు. రాష్ట్ర ఆవిర్భావం మొదటి ఏడాదిలో కరెంట్ ఇబ్బంది ఉండేదని, పక్క రాష్ట్రాల నుంచి అతికష్టం మీద విద్యుత్‌ను కొనుగోలు చేసి 25లక్షల మంది బోర్లకు విద్యుత్‌ను అందించామన్నారు. కాళేశ్వరంపై ఇంకా కాంగ్రెస్ అక్కసు వీడలేదన్నారు. గతంలో మాదిరిగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టుకుంటున్నమని పేర్కొన్నారు.

పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నమని పేర్కొన్నారు. రెండోపంట ధాన్యం కొనుగోలుకు రూ.5,500 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. రైతుకు లక్ష చొప్పున రూ. 17వేల కోట్లు రుణమాఫీ చేశామని వెల్లడించారు. రైతుకు ఉన్నటువంటి ఇబ్బందులను ఆలోచించి పంటల పెట్టుబడి పథకానికి శ్రీకారం చుట్టామని దీనికిగాను సిఎం కెసిఆర్ రూ. 12వేల కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచే నిమిత్తం సీఎం కేసీఆర్ ఆదేశానుసారం రూ. 500కోట్ల సబ్సిడీతో 10వేల ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని అన్నారు. మార్కెట్‌లో రూ. 3వేలున్న కందులకు మద్దతు ధర ఇచ్చి 5,450.3 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. మార్కెట్‌లో సోయాబీన్‌కు ధరలేకపోతే 1.50 లక్షల టన్నులు, శెనగలు లక్ష క్వింటాళ్లు, రూ.1450లు ధర ఇచ్చి 3 లక్షల టన్నులు మక్కలు కొన్నామని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇస్తున్నరని, తాముకూడా తెలంగాణలో కలుస్తామని మహారాష్ట్ర రైతులు అంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి ఇన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం దేశంలో కేసీఆర్ ఒక్కరేనని ఆయన స్పష్టంచేశారు

# ఉర్దూ పాఠశాలల్లో ఖాళీలను భర్తీచేస్తాం

### - విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

2017 డీఎస్సీలో మొత్తం 8,729 పోస్టుల భర్తీకి పక్రియ చేపట్టామని తెలిపారు. ఇందులో ఉర్దూ మీడియం పోస్టులు 900 ఉన్నాయని పేర్కొన్నారు. అయితే 336మంది మాత్రమే అర్హత సాధించారని, మిగిలిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ మీడియం పాఠశాలలు 1109 ఉన్నాయని తెలిపారు

. 5,964 పోస్టుల భర్తీ చేపట్టగా, 4,418 మందిని నియామకం అయ్యారు. ఉర్దూ మీడియం పాఠశాల్లోనే సమస్యలు లేవు. అన్ని పాఠశాలల్లో సమస్యలున్నాయని మంత్రి చెప్పారు. త్వరలోనే ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కారిస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు.

## చరిత్రలో నేటినిజం



5011 రాయలు ఒపేరా భవనము
ధీయుతమై వెలుగుచుండు తెల్లదొరలలో
మాయని కళాకౌతుకులకే
పాయని వాసమ్ముగు చుప్రపంచములోనన్!!

( సెప్టెంబర్ 18 రాయల్ ఒపేరా భవనం ప్రారంభం)



-రాధశ్రీ

సెల్: 9494481210

# ఆధునిక పరిజ్ఞానానికి అందరూ చేరువ కావాలి..!

నేటి నిజం
బుధవారం 18-9-2019

దేశంలో వ్యవసాయ పరిశోధనలు తీవ్ర నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయని కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి పికె బసు ఇటీవల ఒక అంతర్జాతీయ సదస్సులో బయటపెట్టేరు. దేశ ప్రజల ఆకలి తీర్చే క్రమంలో ఆహార భద్రత చట్టాన్ని కొలువు తీర్చాలన్నది ప్రభుత్వ తలంపుగా ఉంది. ఈ చట్టం అమలు కావాలంటే 2020 నాటికి ఆహార ధాన్యాల దిగుబడులను 30 కోట్ల టన్నులకు పెంచాలి.దశాబ్దాల క్రితం మొదటి హరిత విప్లవం విజయవంతమయ్యే క్రమంలో వ్యవసాయ పరిశోధన రంగ సహకారం మరువలేనిది. కొన్నేళ్ళుగా దేశంలో ఈ రంగం ఆశాజనక ఫలితాలు సాధించడంలేదు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరిశోధన సంస్థలన్నింటికీ భారత వ్యవసాయ పరిశోధన మండలి ప్రధానమయినది. 1960 నుంచి పెద్ద ఎత్తున వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరిశోధన సంస్థలు ఏర్పాటు కావడం మొదలయింది. పరిశోధనా రంగానికి కేంద్రప్రభుత్వమే పూర్తిగా నిధులు సమకూర్చాల్సి రావడం అనేక సమస్యలను తెచ్చిపెడుతోంది. అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా ప్రైవేటు పెట్టుబడులను విరివిగా రాబట్టడంలో అటు ప్రభుత్వాలు ఇటు పరిశోధనా సంస్థలు విపరీతంగా విఫలమయ్యాయి. అన్నదాతకు ఆధునిక పరిశోధనా ఫలాలు అందని ద్రాక్షలుగా మారుతున్నాయి. వ్యవసాయ పరిశోధన సంస్థల కునికిపాట్లు సేద్యానికి శాపంగా మారాయి. ఒక వైపు పెరిగిన పెట్టుబడి ఖర్చులతో సేద్యం చేస్తే నష్టాలు తథ్యంగా మారిన నేపథ్యంలో ఆధునిక పరిజ్ఞానం యాంత్రీకరణే శరణ్యంగా మారింది. సర్కారు సైతం ఇక మీదట ఆధునిక పరిజ్ఞానానికే ప్రాధాన్యమివ్వనున్నట్లు ఇటీవల తరచూ ప్రకటిస్తోంది. కానీ ఆ మాటలు నిజమయి అన్నదాత దరికి నూతన సాంకేతిక పరిజ్ఞానం చేరువయ్యే అవకాశాలను తరచి చూస్తే నిర్వేదమే మిగులుతోంది. దేశ ఆహార భద్రతకు కీలకమయిన వ్యవసాయ పరిశోధనల విషయంలో పాలకులు చెప్పిందే చెప్పినట్లుగా ఉపన్యాసాలు ఇస్తుంటే సరిపోతుందనుకోవడం జరుగుతోంది. మూడేళ్ళ క్రితమే కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌ను సమర్పిస్తూ రంగా వర్సిటీకి 100 కోట్లు ఇస్తున్నామన్నారు. నాలుగునెలలైనా పనులు మొదలుకాలేదు. నిధుల మంజూరుకు కృషి చేయడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వము తనవంతు సొమ్ముకలిపి పనులు ప్రారంభం కావడానికి చొరవ తీసుకోవాలి. గడచిన అయిదేళ్లలో ఏర్పాటైన వ్యవసాయ కళాశాలలు, పాలిటెక్నిక్ లకు మౌలిక సౌకర్యాలు, అధ్యాపకులు లేకపోవడం దారుణమయిన విషయం. ఇలాంటి వారిలో చదువుకుని పేరుకు పట్టాలు పుచ్చుకుని బయటకు వచ్చే పట్టభద్రులు వ్యవసాయ అభివృద్ధికి ఏ విధంగా పాటుపడతారో ప్రభుత్వానికే తెలియాలి. నిష్ణాతులైన పరిశోధకులకు దేశంలో కొరత లేదు. అలాంటివారికి ఏలాంటి పైరవీలు లేకుండా నిధులు సమకూర్చితే అటు దేశానికి ఇటు అన్నదాతకు లాభదాయకం. పరిశోధనల్లో తలమునకలు కావాల్సిన శాస్త్రవేత్తలు సచివాలయం చుట్టూ తిరగాల్సిన అవస్థలను తప్పించాలి. ప్రతిభకు పట్టం కట్టాలి. నిధులకు వెనుకడుగు వేయకుండా ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి పాలకులు ముందుకు రావాలి!!

# ఫరూఖ్ అబ్దుల్లా నిర్బంధంపై వైగో పిటిషన్

## నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీరు మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాను కోర్టులో హాజరుపరచాలంటూ ఎండిఎంకె నాయకుడు వైకో దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించవలసిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఫరూఖ్ అబ్దుల్లా నిర్బంధంలో ఉన్నారా అంటూ చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రభుత్వ తరపు రెండవ సీనియర్ న్యాయాధికారి తుషార్ మెహతాను ప్రశ్నించారు. జమ్మూ కశ్మీరు పాలనా యంత్రాంగం నుంచి తనకు ఆదేశాలు రావలసిన అవసరం ఉందని, అప్పుడే దీనిపై తాను సమాధానం ఇవ్వగలనని తుషార్ మెహతా కోర్టుకు విన్నవించారు. సెప్టెంబర్ 15న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి సిఎన్ అన్నాదురై జయంతి ఉత్సవాలలో ఫరూఖ్ అబ్దుల్లా పాల్గొనాల్సి ఉందని, అయితే ఆయన ఆచూకీ తమకు తెలియరాలేదని వైకో తన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కేసులో వైకోకు సంబంధమే లేదని తుషార్ మెహతా వాదించినప్పటికీ సెప్టెంబర్ 30న ఈ కేసు తిరిగి విచారణ చేపడతామని, ఫరూఖ్ అబ్దుల్లా నిర్బంధంపై సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు విచారణను వాయిదావేసింది. కాగా, ఫరూఖ్ అబ్దుల్లాను ప్రభుత్వం నిర్బంధించలేదని, ఆయనే స్వచ్ఛందంగా గృహనిరంధం విధించుకున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపాయి. వెంటనే స్పందించిన ఫరూఖ్ అబ్దుల్లా ప్రభుత్వ వైఖరిపై మండిపడుతూ తనను గృహనిర్బంధంలో ఉంచారని ప్రకటించారు. జమ్మూ కశ్మీరులో ప్రజాస్వామ్య వ్యవస్థను కాకుండా నియంతృత్వ వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు ఎందరిని అరెస్టు చేశారో తనకు తెలియదని, కాని తమను మాత్రం గృహ నిర్బంధంలో ఉంచారని ఆయన మండిపడ్డారు.

# మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో భారీ వర్షాలు

## రెండు రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వరదలు వెల్లువెత్తడంతో ఆ రాష్ట్రాల ప్రజలు అల్లాడుతున్నారు. భారీవర్షాల వల్ల గాంధీ సాగర్ డ్యామ్ తోపాటు రెండు రాష్ట్రాల్లోని పలు రిజర్వాయర్లు వరదనీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. వరదలతో పలు లోతట్టుప్రాంతాలు జలమయం కావడంతో రెండు రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. వరదప్రాంతాల్లో ప్రజలు, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కేంద్రం సైన్యాన్ని రంగంలోకి దించింది. వరదల వల్ల ప్రజలు అల్లాడుతున్న నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగి సహాయ పునరావాస కార్యక్రమాలు చేపట్టింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఎన్డీఆర్ఎఫ్ బలగాలను రంగంలోకి దించి వరద సహాయపనులు ముమ్మరం చేసింది. వాతావరణశాఖ, ఎన్డీఆర్ఎఫ్, కేంద్రజల సంఘం, రాష్ట్రాల అధికారులతో సమీక్షిస్తూ వరదల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని కేంద్ర కార్యదర్శి చెప్పారు.

# ఎస్సీ విద్యార్థుల విదేశీ విద్యకు 20 లక్షలు

## అసెంబ్లీలో మంత్రి కొప్పుల వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకోవాలనుకునే ఎస్సీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం 20 లక్షల రూపాయల స్కాలర్ షిప్ అందిస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్. గతంలో విద్యార్థులకు ఐదు దేశాల్లో మాత్రమే చదువుకునే అవకాశం ఉండేదని.. ప్రస్తుతం 10 దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే అవకాశాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇక ఇప్పటి వరకు గ్రాడ్యుయేషన్ కోర్సులకు మాత్రమే స్కాలర్ షిప్ అందిస్తున్నామని మంత్రి కొప్పుల వెల్లడించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన సభ్యులు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. విద్యార్థుల కోరిక మేరకు ఎంబీబీఎస్ విద్యకు కూడా స్కాలర్ షిప్ ను అందించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. తెలంగాణను గుడుంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గుడుంబా సారా తయారీ వృత్తిని వదులుకున్న వారికి ఉపాధి ప్రభుత్వ తరుపున కల్పిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు కల్లు గీత కార్మికులను పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ అన్ని కులవృత్తులను కాపాడుతున్నారన్నారు. కల్లు గీత కార్మికులు చనిపోతే రూ. 5లక్షలు ఇస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వెనుకబడిన తరగతుల విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేశామని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో, వసతిగృహాల్లో సన్నబియ్యంతో భోజనం పెడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు సన్నబియ్యంపై సభ్యులు అడిన ప్రశ్నలకు మంత్రి గంగుల సమాధానం చెప్పారు.

# చిల్లర రాజకీయాలకు పరాకాష్ట... కోడెల మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 17:రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన ఓ నేత తన జీవితాన్ని అర్థాంతరంగా ముగించిన తీరు తెలుగు ప్రజలనే కాకుండా దేశ రాజకీయాలను కలచివేసే చర్యగా చూడాలి. సర్కార్ వేధింపులకు కోడెల శిప్రసాదరావు ఆత్మహత్యకు పాల్పడడం నిజంగా బాధాకరం. ఉమ్మడి ఎపిలో పలు పదవులు నిర్వహించిన కోడెల శిప్రసాద్ రాజకీయంగా ఎలా ఉన్నా విధి నిర్వహణలో దిట్టగా పేరు తెచ్చుకున్నారు. ఏ పదవి అప్పగించినా అకుంఠిత దీక్షతో, పట్టుదలతో చేసే తత్వం ఉంది. తన శాఖలో ఎలాంటి పనినయినా చిటికెలో చేసి ప్రజలకు చేరువయ్యే వాడు. ఎన్టీఆర్ నీడలో ఆయన అడుగుజాడల్లో కోడెల మంచి రాజకీయవేత్తగా రాటుదేలారు. ప్రజలతో నిత్య సంబంధాలు నెరపడమే గాకుండా, వారి సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేశారు. వైద్యుడిగా కూడా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించి ప్రజల మన్ననలు పొందారు. అలాంటి వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం దౌర్భాగ్య రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. ఆయన ఆత్మహత్యపై నిజంగానే దర్యాప్తు చేయాలి. కోడెలపై ఎలాంటి ఒత్తిళ్లు లేవనడానికి లేదు. రాజకీయాల్లో రాటుదేలిన కోడెల పిరికివాడేమీ కాదు. కానీ ఆయన ఆత్మగౌరవం దెబ్బతినేలా మాత్రం ప్రభుత్వంలోని కొందరు వ్యవహరించారనడంలో సందేహం లేదు.

ఆయన వ్యక్తిత్వ హననం జరిగింది. ఆయన పట్ల చాలా అవమానకరంగా మాట్లాడారు. ఆత్మహత్య చేసుకున్న తరవాత కూడా ఇది కొనసాగడం వారి నీచ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు చేస్తున్న వ్యాఖ్యలు అమానవీయ రాజకీయాలకు అద్దం పడుతున్నాయి. కోడెల శివప్రసాదరావు జీవితం అర్ధంతరంగా ముగిసిపోవడానికి కారకులు ఎవరన్నది తేలాలి. రాష్ట్ర రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించి.. పలుసార్లు మంత్రిగా, నవ్యాంధ్ర తొలి స్పీకర్‌గా సేవలు అందించిన ఆయన.. ఆత్మహత్య చేసుకొని తనువు చాలించారన్న వార్త నిజంగానే ఆధునిక రాజకీయాల్లో తలవంచుకునేలా చేసింది. వైద్యవృత్తి నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కోడెల ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడమే గాకుండా ప్రజల్లో ఓ దమ్మున్న నేతగా ఎదిగారు. గుంటూరు జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆయన.. 1983 నుంచి 2004 వరకు వరుసగా ఐదుసార్లు నరసరావుపేట నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారంటే ఆయనకు ఎంతటి ప్రజాదరణ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎన్టీ రామారావు, చంద్రబాబునాయుడు మంత్రివర్గాల్లో పలు శాఖలు నిర్వహించిన ఆయన.. నవ్యాంధ్ర తొలి శాసనసభాపతిగా ఎన్నికై.. ఐదేళ్లు సేవలు అందించారు. చిన్నతనంలోనే తోబుట్టువులు అనారోగ్యంతో చనిపోవడం కోడెలను తీవ్రంగా కలిచివేచింది. ఆ విషాదం నుంచే డాక్టర్ కావాలని నిర్ణయించుకున్న ఆయన.. తాత ప్రోత్సాహంతో వైద్య విద్యనభ్యసించారు. కర్నూలు వైద్య కళాశాలలో చేరి.. రెండున్నరేళ్ళ తర్వాత తిరిగి గుంటూరుకు మారి అక్కడే ఎంబీబీఎస్ పూర్తి చేశారు. వారణాసిలో ఎం.ఎస్ చదివారు. నరసరావుపేటలో హాస్పిటల్ నెలకొల్పి వైద్యవృత్తిని చేపట్టిన ఆయన.. అనతికాలంలోనే మంచి డాక్టర్‌గా స్థానికంగా పేరు తెచ్చుకున్నారు. ప్రజలు ఆయన వద్ద వైద్యం చేయించుకునేందుకు ఎదురు చూసేవారు. ఏదైనా ఆపరేషన్ చేయాల్సి వస్తే ఆయన వచ్చినప్పుడే చేయించుకునేవారు. అలా పల్నాడు లో అంచెలంచెలుగా ఎదిగి.. ప్రముఖ సర్జన్‌గా కీర్తిగడించిన డాక్టర్ కోడెల ఎన్టీఆర్ పిలుపుతో తెలుగుదేశం పార్టీలోకి వచ్చారు. ఉమ్మడి ఎపిలో అనేక పదవులను సమర్థంగా నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన తొలి ఎన్నికల్లో సొంత నియోజకవర్గం నరసరావుపేటను వదిలి సత్తెనపల్లి నుంచి పోటీచేసిన కోడెల మరోసారి విజయం సాధించారు. అనంతరం నవ్యాంధ్ర తొలి స్పీకర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి.. ఐదేళ్లపాటు సేవలు అందించారు. ఇటీవలి ఎన్నికల్లో పార్టీ పరాజయం, సత్తెనపల్లిలో ఆయన ఓటమిపాలయ్యాక.. నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో ఆయన కుటుంబ సభ్యులపై పలు కేసులు నమోదు కావడం తీవ్రంగా కలచి వేసింది. తొలుత కొంత నిబ్బరంగానే ఎదుర్కొనే ప్రయత్నం చేసినా నేరుగా తనపైనే అసెంబ్లీ ఫర్నిచర్‌ను దొంగిలించారన్న ఆరోపణ మోపడం, దానిపై పోలీసు కేసు నమోదు కావడం ఆయనను తీవ్ర మనస్తాపానికి గురిచేసింది.

ఫర్నిచర్ విషయంలో ఏం జరిగిందో మీడియా ప్రతినిధు లకు, తన సన్నిహితులకు ఆయన పలు సార్లు వివరించారు. ఆ వివరాల ప్రకారం.. అమరావతిలో కొత్త అసెంబ్లీ కట్టిన సమయంలో అందులో పాత ఫర్నిచర్ ఎందుకని నాటి ప్రభుత్వం కొత్త ఫర్నిచర్ ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుంచి వచ్చిన పాత ఫర్నిచర్‌ను స్పీకర్ తన నివాసంలో, క్యాంపు కార్యాలయంలో వినియోగించుకోవచ్చని.. స్పీకర్‌కు అధికారం ఉంటుందని కొందరు అసెంబ్లీ అధికారులు సలహా ఇవ్వడం తో స్పీకర్‌కు పీఎస్‌గా ఉన్న అధికారి ఆదేశంతో వాటిని ఆయన నివాసానికి, కార్యాలయానికి తరలించారు. అసెంబ్లీ ఫర్నిచర్‌ను కోడెల ఎత్తుకుపోయారని అధికారపక్షం నుంచి ఆరోపణలు మొదలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి ఆయన నివాసాలు, కార్యాలయాలు తనిఖీ చేసి కొంత ఫర్నిచర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలపై వల్ల ఆయన ఎంతో కలత చెందారు. అదే చివరకు బలవన్మ రణానికి దారి తీసింది. రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన తాను తలదించుకునే పరిస్థితి కల్పించారన్న బాధ ఆయనలో తరచూ కనిపించేది. ఓ వ్యక్తి ఆత్మగౌరవం దెబ్బతింటే ఎంతటి విపరిణామాలు కలుగు తాయో కోడెల ఆత్మహత్య వ్యవహారమే ఇందుకు నిదర్శనం. రాజకీయాల్లో హుందాతనం ఉండాలే గానీ చిల్లర రాజకీయాలు చోటుకోరాదు. కోడెల ఆత్మహత్య నేటితరం రాజకీయ వేత్తలకు కనువిప్పు కావాలి.

# కోడెల మృతికి వెంకయ్య,గవర్నర్‌ల సంతాపం

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మృతి విచారకరమని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. కోడెల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. టీడీపీ సీనియర్ నేత, ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మరణం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోడెల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

÷రిళిడెల శివప్రసాదరావు మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోడెల మృతిపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విచారం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఆంధప్రదేశ్ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మరణించారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఓ ప్రకటనలో తెలిపారు. కోడెల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని ప్రకటించారు. ఇదిలావుంటే కోడెల శివప్రసాదరావు మృతిపై విజయవాడ ఎంపీ కేశినేని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. కోడెలది ఆత్మహత్య కాదని, దారుణహత్య అన్నారు. ఆయనను సీఎం జగన్మోహన్ రెడ్డి దారుణంగా హత్యచేశారని ఆరోపించారు. ట్విట్టర్ వేదికగా కేశినేని ఈ వ్యాఖ్యలు చేశారు. కోడెల ఆత్మకు శాంతి చేకూర్చాలని.. భగవంతున్ని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నానంటూ మరో ట్వీట్ చేశారు.

# యెమెన్ దాడులతో తీవ్ర ప్రభావం

## చమురు ధరలు పెరిగే ప్రమాదం

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): సౌదీ అరేబియాలోని చమురు నిల్వలపై యెమెన్‌కు చెందిన హౌతి తిరుగుబాటుదారులు శనివారం దాడి చేసిన సంఘటనలో రోజుకు 57 లక్షల బ్యారెళ్ల చమురు సరఫరా నిలిచిపోయింది. పర్యవసానంగా అంతర్జాతీయ మార్కెట్‌కు రోజుకు ఐదు శాతం చొప్పున చమురు సరఫరా నిలిచిపోయింది. పర్యవసానంగా అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరిగి పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ చమురు మార్కెట్ నిపుణులు సోమవారం హెచ్చరించారు. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగకుండా నివారించేందుకు తక్షణమే అమెరికా దేశీయ చమురు నిల్వలను విడుదల చేయాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు.

అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రెండు, మూడు రోజులు అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగకుండా నిలబడవచ్చని, మంటల్లో చిక్కుకుని తీవ్రంగా నష్టపోయిన సౌదీ అరేబియా చమురు సంస్థ ఎప్పటిలోగా తమ చమురు ఉత్పత్తుల సరఫరాను పునరుద్ధరించగలదనే అంశంపై ఆధారపడి చమురు ధరలు పెరగడం, పెరగకుండా ఉండడం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుత సౌదీ అరేబియా చమురు సంస్థ సరఫరాపై అనిశ్చిత పరిస్థితే కొనసాగుతోంది. ఎందుకంటే ఇప్పటికీ అక్కడి చమురు నిల్వల నుంచి పొగ వెలువడుతూనే ఉంది. సౌదీపై ఈ దాడికి పాల్పడింది ఎవరో ఇప్పటికే గుర్తించామని, వారిపై ప్రతీకార దాడి జరిపేందుకు ఆయుధాలు లోడ్ చేసి పెట్టుకున్నామని, సౌదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మరుక్షణం దాడికి పాల్పడతామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ప్రోత్సాహంతో యెమెన్‌కు చెందిన హౌతి మిలిటెంట్లు ఈ దాడికి పాల్పడ్డారని అంతర్జాతీయ వార్తలు తెలియజేస్తుండగా, ఇరాన్‌యే ఈ దాడికి పాల్పడిందని అమెరికా నేరుగా ఆరోపిస్తోంది. అంటే ఇరాన్‌పైనే అమెరికా దాడి చేసే అవకాశం ఉంది. ఈ ఉద్రిక్తల కారణంగా కూడా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగే అవకాశం ఉంది.

# ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయాలి

## కొత్త భవనాల కోసం అప్పుడే తొందర సరికాదు
## అసెంబ్లీ నిర్మాణంతో నిధుల వృధా సరికాదు

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): ఎర్రమంజిల్‌లో కొత్త అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలన్న మంత్రివర్గ నిర్ణయాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వం కళ్లు తెరవాలి. కొత్త భవనాలను కట్టడం అన్నది ఇప్పటికిప్పుడు వాయిదా వేసుకుని, తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై దృష్టి సారించాలి. ప్రధానంగా వైద్యపరంగా తెలంగాణ ఎంతో వెనకబడి ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నీరసించాయి. రాష్ట్రంలో డెంగ్యూ, ఇతర విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ దశలో ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు వెచ్చించాలి. అలాగే వాటిని బలోపేతం చేసి గ్రామాల్లో వైద్యులను నియమించి, ఆస్పత్రలు÷-లో మందుల కొరత లేకుండ చూడాలి. సచివాలయం, అసెంబ్లీ నిర్మాణాలకు ఇప్పుడు తొందర కూడా లేదు. అసెంబ్లీ కావాలనుకుంటే ఖాళీస్థలంలో కట్టుకుంటే సరిపోతుంది. అందుకు ఖాళీగా ఉన్న స్థలాలు హైదరాబాద్‌లో బోలెడు ఉన్నాయి. లేదా ఉన్న అసెంబ్లీ ఇప్పటి అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసుకోవచ్చు. పాత,కొత్త అసెంబ్లీ భవనాలను ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా మార్చుకుంటే ఖర్చును తగ్గించుకోవచ్చు. హైకోర్టు తీర్పు దృష్ట్యా మళ్లీ దాని జోలికి వెళ్లకుండా ముందుకు సాగడమే మంచిది. విపక్షపార్టీలు కూడా దీనిని వ్యతిరేకిస్తున్నాయి. దీంతో దీనిపై ప్రభుత్వం భేషజాలకు పోకుండా త్వరగా ఓ నిర్ణయాన్ని ప్రకటిస్తే మంచిది. హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్‌కు కనువిప్పు కలగాలన్నారు. ఎర్రమంజిల్‌లో కొత్త అసెంబ్లీ నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పు పడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పును టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వాగతించారు. కోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురు దెబ్బ అని అన్నారు. ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను కూల్చివేసి, దాని స్థానంలో కొత్తగా శాసనసభ, శాసనమండలి సమావేశమందిరాలను నిర్మించాలని ఈ ఏడాది జూన్ 18న రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. మంత్రిమండలి నిర్ణయాన్ని రద్దు చేసింది. ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాలపై న్యాయ సమీక్ష చేసే అధికారం పరిమి తవే అయినప్పటికీ చట్టాలను విస్మరించి నిర్ణయం తీసుకుంటే అది విధాన నిర్ణయమైనా జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. తెలంగాణ సర్కారు చట్టాలను ఎక్కడ ఉల్లంఘించిందో విపులీకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు తుది ఆదేశాలు జారీచేసింది. ఇకపోతే 2010 మాస్టర్ ప్లాన్‌లోని ప్రత్యేక ఆరక్షిత జోన్‌లో ఎర్రమంజిల్ ప్యాలెస్‌కు రక్షణ కొనసాగుతూనే ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం విస్మరించింది. హెరిటేజ్ భవనాలకు మార్పులు, చేర్పులు చేయాలన్నా, కూల్చివేయాలన్నా జోనింగ్ రెగ్యులేషన్స్ 1981లోని రెగ్యులేషన్ 13 ప్రకారం అనుమతులు పొందాలని స్పష్టం చేసింది. వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలని, వాటి గుర్తులను, ఆనవాళ్లను చెరిపివేయరాదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో ప్రతిష్ఠాపించిన నిబంధనలను ప్రభుత్వం విస్మరించిందని హైకోర్టు పేర్కొంది. భవిష్యత్తు అవసరాలకు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు గత వైభవాలను రక్షించి, భావి తరాలకు అందించాల్సిన అవసరాన్ని హైకోర్టు గుర్తు చేసింది. ప్రస్తుత అసెంబి, శాసనమండలి భవనాలకు తరుచూ మరమ్మతులు చేయాల్సి వస్తోందని, 2017లో శాసన మండలి భవన పటిష్ఠతపై అధ్యయనం చేసిన నిపుణులు భద్రత లేదని నివేదిక ఇచ్చినట్లు అదనపు ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రస్తుత భవనాలకు అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే ఏర్పాట్లు లేవన్నారు. సమీకృత చట్టసభ సభ్యుల సముదాయం నిర్మించాలని మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుత అసెంబ్లీ భవనం నిజాం కాలంలో నిర్మించినదని చెప్పారు. అయితే ఈ వాదనలను ధర్మాసనం తిరస్కరించినందున ఇక పాతభవనాలను కూల్చే ప్రయత్నాలు విరమించుకోవడం ద్వారా ప్రభుత్వం ముందుకు పోవడమే మంచిది.

# డప్పు కళాకారులకు పెరిగిన గిరాకీ

## పొట్టకూటి కోసం పల్లెలు వదిలి వస్తున్న దరువుకారులు

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): వారు దరువేసి డప్పుపై తీన్మార్ వాయిస్తే.. ఒళ్లు పూనకం వచ్చినట్టు ఊగిపోవాల్సిందే... వారి డప్పు మోగిస్తే... ఎదురుగా ఉన్న ప్రతి మనిషి నాట్యం చేయాల్సిందే.... గ్రామీణ డప్పు కళాకారుల ప్రతిభ ఇప్పుడు పట్టణాలకు వ్యాప్తి చెందింది. దీంతోపాటు ఎక్కడికి వెళ్లినా వారు తమకు ఉపాధి దక్కడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ డప్పు కళాకారులకు వివిధ సందర్భాల్లో పట్టణాలకు వచ్చి తమ సత్తా చాటుతున్నారు.

బోనాల జాతర,వినాయక నిమజ్జనం, దసరా ఉత్సవాలు ఇలా వివిధ రకాల పండుగలకు సంబంధించి గ్రామీణ డప్పు కళాకారులు బాగా ప్రాచుర్యం పొందారు. ఇటీవల వీరంతా గణనాథుల నిమజ్జనంలో భాగంగా జంటనగరాలతో పాటు పట్టణాల్లో సత్తా చాటారు.

ఇలా డప్పు కళాకారులు గ్రామాల నుంచి బతుకు దెరువును వెతుక్కుంటూ పట్టణాలు, నగరాలకు తరలి వచ్చారు. నగరంలోని బ్యాండ్ వాయించే కళాకారులు ఎక్కువ మొత్తంలో పైకాన్ని వసూలు చేయడంతో ఉత్సవ నిర్వాహకుల దృష్టి గ్రామీణ కళాకారులపై పడింది. గ్రామీణ కళాకారులైతే తక్కువకు వస్తారని నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు గ్రామీణ కళాకారుల వద్దకు వస్తున్నారు. ఇలా గత కొంత కాలంగా నిమజ్జన ఉత్సవాలకు హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలైన మెదక్, వరంగల్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి తీన్మార్ వాయించే డప్పుల కళాకారులు వస్తున్నారు. అదే కోవలో ఈ సంవత్సరం కూడా వివిధ జిల్లాల నుంచి బృందాలుగా ఏర్పడి వందలాది మంది వచ్చి సికింద్రాబాద్‌లోని జింఖానా పరేడ్ మైదానం గోడ పక్కన సేద తీరుతూ ఉపాధిని వెతుక్కుంటున్నారు. డప్పులు దరువేసి నాలుగు రూపాయలు సంపాదించవచ్చనే ఆశతో పని కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వందల కిలోమీటర్ల దూరం నుంచి వందలాది రూపాయల చార్జీలు పెట్టుకొని కళాకారులు కడుపు చేతబట్టుకొని ఎంతో ఆశతో నగరానికి వచ్చారు. ఈ తరుణంలో గ్రామీణ కళాకారులేగా అని చిన్న చూపు చూస్తూ వారి వద్దకు వచ్చి

ఇష్టారాజ్యంగా కళాకారులకు ఒక్కరికి రూ.200 నుంచి రూ.500ల వరకు బేరమాడుతున్నారు. ఒక వేళ బేరం కుదిరినా.. పని పూర్తయ్యాక ఇస్తామన్న పైకం ఇవ్వకుండా ఉడాయిస్తున్నారు. కొందరు మాత్రమే ఆదరిస్తున్నారు.

# నిత్యం నెత్తురోడుతున్న రాజీవ్ రహదారి

## వంకరలను మార్చడంలో పట్టింపులేని సర్కార్
## ఆందోళనలు చేసిన వారే అధికారంలో ఉన్నాకానరాని మార్పు

కరీంనగర్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): రాజీవర్ రహదారి నిత్యం నెత్తురోడుతోంది. ఈ రహదారి వంకరలను సవరిస్తామన్న ప్రతిపాదనలు బుట్టదాఖలు అయ్యాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో దీనిపై తీవ్ర ఆందోళనలు సాగాయి. ఆనాటి నేతలు ఇప్పుడు అధికారంలో ఉన్నా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా సిద్దిపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి హరీష్ రావు దీనిపై ఒక్క మాటా మాట్లాడడం లేదు.

వంద కిలోమీటర్ల వేగం మించకుండా రాజీవ్ రహదారిపై వాహనాలు నడపాల్సి ఉంటుంది. కానీ మితివీరిన వేగంతో వాహనాలు దూసుకెళుతుంటాయి. వేగాన్ని నియంత్రించేలా స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేస్తామని అధికారులు మూడున్నర నెలల క్రితం ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. రహదారి చాలా చోట్ల మలుపులు ఉండటంతోనే సాధ్యం కావడం లేదన్న సమాధానమిస్తున్నారు. సిద్దిపేట జిల్లా పరిధిలో దాదాపు 90 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారి కొన్ని చోట్ల మాత్రమే కిలోమీటరు కంటే ఎక్కువ దూరం మలుపులు

లేకుండా ఉందని వివరించారు. గతంలో శాసనసభా సంఘం అధ్యయనంలోనూ కేవలం ఈ ఒక్క జిల్లా పరిధిలోనే 60 ప్రమాదకర మలుపులు ఉన్నట్లు తేలింది. వాటిని సరిచేసే అంశమై ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కనీసం మలుపులు లేని చోట్ల స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేసి వాహనాల వేగానికి కళ్లెం వేస్తే ప్రమాదాల సంఖ్యతో పాటు తీవ్రత తగ్గే అవకాశముంది. ఇకపోతే నిత్యం నెత్తురోడుతున్న రహదార్లు చూసి, ఏటా దాదాపు లక్షన్నరమంది రోడ్డు ప్రమాదాల్లో కన్నుమూస్తున్న తీరు గమనించి కఠిన చర్యలు అవసరమన్న అభిప్రాయం అందరిలోనూ ఏర్పడిన తరుణంలో కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టం సవరణ బిల్లును రాజ్యసభ ముందుంచింది. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన గణాంకాలు చూస్తే భయాందోళనలు కలుగుతాయి. రోడ్డు ప్రమాద మృతుల సంఖ్యలో ప్రపంచంలోనే మనది ద్వితీయ స్థానం. దేశంలోని అసహజ మరణాల్లో వీటి శాతం 44గా ఉంది. సగటున రోజుకు 17మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, గణాంకాలను విశ్లేషిస్తే అర్ధమవుతుంది. ప్రమాదాల విషయంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం అంతా ఇంతా కాదు. ఉద్దేశపూర్వకంగా ప్రజా రవాణా వ్యవస్థ పీకనొక్కుతూ జనం సొంత వాహనాలపై ఆధారపడక తప్పని స్థితి కల్పిస్తున్నవి ప్రభుత్వాలే. తగినన్ని బస్సులు అందుబాటులో ఉంచకపోవటం, అవి కూడా సమయానికి రాక పోవడం వగైరా కారణాల వల్ల పనులపై బయటికెళ్లేవారు, ఉద్యోగాలు చేసేవారు, విద్యార్థులు తప్ప నిసరిగా సొంత వాహనాలు సమకూర్చుకోవాల్సి వస్తోంది. మన రహదార్ల నిర్వహణ సక్రమంగా లేదని తెలిసినా, అవి భారీ సంఖ్యలో వాహనాలను భరించేంత ప్రామాణికమైనవి లేదా విశాలమై నవి కాదని తెలిసినా ప్రభుత్వాలు వాహనాల అమ్మకాలపై నియంత్రణ పెట్టడం లేదు. కాలం చెల్లిన వాహనాలు తిరుగుతున్నా, అవి కాలుష్యాన్ని వెదజల్లుతున్నా పట్టించుకునేవారుండరు. అయితే కేవలం భారీ జరిమా నాలు మాత్రమే సమస్యను చక్కదిద్దలేవు. రోడ్డు

ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు సాయం చేయడానికి ప్రయత్నించినవారికి ఇకపై కేసుల బెడద ఉండదు. రహదార్ల భద్రత గురించి తరచు మాట్లాడే పాలకులు సవరణ బిల్లులో దానికంత ప్రాముఖ్యత ఇవ్వకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. 50 కన్నా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలను 'బ్లాక్ స్పాట్'లు గుర్తించి అక్కడ దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నామని రవాణా మంత్రి నితిన్ గడ్కరీ చెబుతున్నారు. మంచిదే. కానీ ఇంజనీరింగ్ లోటు పాట్లున్నట్టు రుజువైతే సంబంధిత అధికారులపై తీసుకునే చర్యలేమిటన్న ప్రతిపాదన లేదు. రాజీవ్ రహదారిపై సరకు రవాణా వాహనాల్లోనూ ప్రజలు ప్రయాణి స్తున్నారు. ఇతర వాహనాల్లోనూ పరిమితి కంటే ఎక్కువ సంఖ్యలో జనాలను కుక్కేస్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్నా.. నిబంధనలకు విరుద్ధంగా సరకు రవాణా వాహనాల్లో ఇష్టారీతిన వెళుతున్నా రవాణా శాఖ అధికారులు చూసీ చూడనట్లు ఉండిపోతున్నారు. దీంతో ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. వాహనదారులు, ప్రజల్లో అవగాహన కలిగించే దిశగా అడుగులు పడకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# హిందూ మహాసముద్రంలో చైనా యుద్ధ నౌక

## గుర్తించిన భారత వాయుసేన అధికారులు

న్యూఢిల్లీ,సెప్టెంబర్17 (ఆంఎన్ఎ): హిందూ మహాసముద్రం దక్షిణ ప్రాంతంలో చైనా త్రివిధ యుద్ధనౌక కలకలం రేపింది. ఈ నెల మొదట్లో భారత వైమానిక దళం నిఘా నిర్వహిస్తున్న సందర్భంగా ఈ యుద్ధనౌక కనిపించింది. ల్యాండింగ్ ప్లాట్ ఫాం డాక్ (ఎల్‌పీడీ)గా పిలిచే ఈ యుద్ధనౌకను నేవీ పి-8ఐ నిఘా విమానం గుర్తించినట్టు భారత వాయుసేన వర్గాలు వెల్లడించాయి. వాయుసేన వర్గాల కథనం ప్రకారం... ఆఫ్రికా లేదా గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు చైనా నౌకలు తరచూ మలక్కా జలసంధి నుంచి ప్రారంభమయ్యే జలమార్గాన్ని ఉపయోగిస్తున్నాయి. ఎల్‌పీడీ నౌకపై ట్రక్కులు, ట్యాంక్‌లు, జీప్‌లను కూడా తరలించవచ్చు. ఒక్కోసారి ఇది పెద్దసంఖ్యలో హెలికాప్టర్లను కూడా తరలించగలదు. యాంటీ-పైరసీ ఆపరేషన్స్ కోసం పనిచేసే నౌకలు కూడా ఈ మార్గం గుండా తరచూ వెళ్తుంటాయి. చైనా యుద్ధనౌకలు ఆఫ్రికా, గల్ఫ్ వెళ్లాలంటే ఈ ఒక్క మార్గమే అందుబాటులో ఉంది... అని ఓ సీనియర్ నేవీ అధికారి వెల్లడించారు. భారత నిఘా విమానం ద్వారా ఎల్‌పీడీ యుద్ధనౌక ఫోటోలు తీసినట్టు వైమానిక దళం వర్గాలు తెలిపాయి.

# ఏడాదిలోగా రెండు లక్షల డబుల్ ఇళ్లు

## -శాసనసభలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది రెండు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని రాష్ట్ర శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ చెప్పారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం ఇప్పటి వరకు రూ. 6972 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. హైదరాబాద్ పరిధిలోని స్థిరాస్తి వ్యాపారులంతా నిర్మిస్తున్న సంఖ్యకు సమానంగా ప్రభుత్వ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. మన రాష్ట్రంలో జరుగుతున్నట్లుగా ఇళ్ల నిర్మాణం మరే రాష్ట్రంలోనూ లేదు. ఇళ్ల నిర్మాణ పనుల ప్రభావం రాష్ట్ర జిడిపీ మీద సానుకూల ప్రభావం చూపింది. రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తోంది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పథకం వల్ల స్టీలు, ఇటుక, గృహ సామాగ్రి పరిశ్రమల్లో కూడా వృద్ధి కనిపిస్తోంది. కొల్లూరు వద్ద ఆసియాలోనే అతిపెద్ద ప్రభుత్వ గృహ సముదాయం నిర్మిస్తున్నాం. త్వరలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చెప్పారు. నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్ మాట్లాడారు. ప్రజాకర్షక పథకాలను ప్రవేశ పెడుతూ, ప్రజల మన్ననలందుకుంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అనీ, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్న సీఎం కెసిఆర్‌కి ధన్యవాదాలు తెలిపారు. దేశంలో క్రిస్మస్‌ను అధికారికంగా జరుపుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఈ సందర్భంగా స్టీఫెన్ సన్ అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని ఆయన అన్నారు.

# చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్

## కేవీకే పెరుమాళ్‌కు తాజాగా సమన్లు

న్యూఢిల్లీ,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): ఐఎన్ఎక్స్ మీడియా కేసులో మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటూ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. అప్పట్లో చిదంబరానికి వ్యక్తిగత కార్యదర్శిగా వ్యవహరించిన కేవీకే పెరుమాళ్‌కు తాజాగా సమన్లు జారీ చేసింది. ఈనెల 18న ఆయనను ఈడీ విచారణకు హాజరుకావాలని ఆ సమన్లలో పేర్కొంది. ఇడీ డిప్యూటీ డెరెక్టర్ మనీష్ గుప్తా, ఆర్.ఎస్.థపిలియాల్ కలిసి పెరుమాళ్‌ను విచారించ నున్నారు. పెరుమాళ్ కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలు, 2004 నుంచి ఆయన ప్రయాణించిన దేశాలకు సంబంధించిన వివరాలు, వీసాలు, పాస్‌పోర్టుల ఫోటోకాపీలను అందజేయాలని ఈడీ అధికారులు పెరుమాళ్‌ను కోరారు. ఆయన నుంచి 40 ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలని కూడా ఈడీ పట్టుదలగా ఉంది. గతంలో ఈడీ రెండు సార్లు ఆయనను విచారించినప్పటికీ ఆయన సరైన సమాధానాలు ఇవ్వలేదని ఈడీ చెబుతోంది. కాగా, ఇటీవల సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ సందర్భంగా చిదంబరం తరఫు న్యాయవాది తన వాదన వినిపిస్తూ, ఐఎన్ఎక్స్ మీడియాకు ఎఫ్ఐపీబీ క్లియరెన్స్‌కు ఆరుగురు ప్రభుత్వ కార్యదర్శులు ఆమోదం తెలిపారని, తన క్లయింట్ ఒక మంత్రిగా కేవలం సంతకం చేశారని అన్నారు. చిదంబరం సైతం ఇటీవల ఓ ట్వీట్‌లో... ఈ కేసులో ఏ ఒక్క అధికారి అరెస్టు కాలేదని, వారెవరూ తప్పు చేయకపోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి చిదంబరం వ్యక్తిగత కార్యదర్శికి ఈడీ తాజాగా సమన్లు జారీచేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సోషల్ మీడియాలో స్నేహం పేరుతో మోసం

## యువతి నగ్న వీడియోతో బ్లాక్ మెయిల్
## యువతి ఫిర్యాదుతో యువకుడి అరెస్ట్

ముంబై,సెప్టెంబర్17 (ఆంఎన్ఎ): యువతికి చెందిన నగ్న వీడియోను బయటపెడతానంటూ ఓ యువకుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. వీడియోను రూ. 5వేలకు అమ్ముతానంటూ ఆమె స్నేహితుల వద్దే బేరం పెట్టాడు. ఈ సంఘటన ముంబైలోని పావయ్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్తాన్‌కు చెందిన జితెన్ తన్సుఖానీకి అనే యువకుడికి గత నెల ఆగస్టులో ఓ 24ఏళ్ల యువతితో సోషల్ మీడియాలో స్నేహం ఏర్పడింది. ఇద్దరూ తరుచూ వీడియో కాలింగ్‌లో మాట్లాడుకునేవారు. ఈ నేపథ్యంలో ఓ రోజు వీడియో చాటింగ్ చేస్తున్న సమయంలో యువతిని దుస్తులు తొలగించవల్సిందిగా అతడు కోరాడు. ఆమె అతడు చెప్పినట్లుగానే చేసింది. అయితే జితెన్ ఆ దృశ్యాలను తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశాడు. కొద్దిరోజులు తర్వాత యువతి మిత్రులతో ఆమెకు సంబంధించిన నగ్న వీడియో తన వద్ద ఉందని, వీడియోను రూ.5వేలకు అమ్ముతానని బేరమాడాడు. అయితే ఆ యువతి స్నేహితులు ఆమెకు జితెన్ నిర్వాకంపై సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె అతన్ని ఈ విషయంపై ప్రశ్నించగా.. నిజమేనని ఒప్పుకున్నాడు. తనకు రూ. 70వేలు చెల్లిస్తే వీడియోను డిలెట్ చేస్తానని, లేదంటే సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. ఆమె పోలీసులను ఆశ్రయించి జితెన్‌పై ఫిర్యాదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈనెల 13న జితెన్‌ను అరెస్ట్ చేశారు.

# విద్యుత్ షాక్‌తో ముగ్గురు రైతుల మృతి

కామారెడ్డి,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని మాచారెడ్డి మండలం ఎల్పుగొండలో విషాద సంఘటన చోటు చేసుకుంది. కరెంట్ షాక్‌తో ముగ్గురు రైతులు మృతి చెందారు. బోరు మోటరు తీస్తుండగా పైన ఉన్న కరెంటు తీగలకు పైపు తగలడంతో షాక్ కొట్టి ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు మురళీ ధర్‌రావు(55), ఇమ్మడి నారాయణ(40), లక్ష్మణ్‌రావు(60)గా గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, విద్యుత్ అధికారులు విచారణ చేపట్టారు.

# మోడీతో ట్రంప్ వేదిక పంచుకుంటారు

## -ప్రకటించిన వైట్ హౌజ్ ప్రతినిధి

న్యూయార్క్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): ఈ నెల 22న అమెరికాలోని హ్యూస్టన్ లో జరగనున్న హౌడీ మోడీమెగా ఈవెంట్ లో భారత ప్రధాని నరేంద్రమోడీతో కలిసి ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ కూడా పాల్గొన బోతున్నట్లు వైట్ హౌస్ ప్రకటించింది. ఓ అమెరికా అధ్యక్షుడు, భారత ప్రధాని కలిసి సంయుక్త ర్యాలీలో ప్రసంగించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇద్దరు నేతలు ఒకే వేదికపై కలవడం రెండు దేశాల బంధాన్ని చాటి చెబుతుందని వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రటరీ స్టెఫెనీ గ్రిసామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రంప్-మోడీల మధ్య జి20, జి 7 శిఖరాగ్ర సమావేశాల తర్వాత కొన్ని వారాల వ్యవధిలో వరుసగా ఇది మూడవ సమావేశం కావడం గమనార్హం. హ్యూస్టన్‌లోని విశాలమైన ఎన్ఆర్‌జి స్టేడియంలోఈనెల 22న జరగనున్న హౌడీ, మోడీ! షేర్డ్ డ్రీమ్స్, బ్రైట్ ఫ్యూచర్స్ కార్యక్రమానికి అమెరికా నలుమూలల నుండి 50 వేల మంది అమెరికాలో స్థిరపడిన భారతీయులు రిజిస్టర్ చేసుకున్నారు. మోడీతో వేదిక పంచుకోవడం, భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం లాంటి చర్యలు.. ప్రెసిడెంట్ ట్రంప్‌కు 2020 ఎన్నికల్లో కలిసొచ్చే అంశంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కోడెల మృతిపై..

# అనుమానాస్పద కేసు నమోదుచేశాం

## - మూడు బృందాలతో దర్యాప్తు చేస్తున్నాం
## - బంజారాహిల్స్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్

హైదరాబాద్, సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ) : టీడీపీ సీనియర్ నేత, ఏపీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ మృతిపై అనుమానాస్పద కేసు నమోదుచేశామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూడు బృందాలతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బంజారాహిల్స్ ఏసీపీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోందన్నారు. కోడెల భౌతిక కాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత ఆయన మృతిపై క్లారిటీ వస్తుందని సీపీ తెలిపారు. కోడెల మృతికి సంబంధించి క్లూస్ టీం, టెక్నికల్ టీం దర్యాప్తు చేస్తున్నాయని, హైదరాబాద్‌లోని కోడెల నివాసానికి చేరుకుని క్లూస్ టీం ఆధారాలు సేకరించే పనిలో పడిందన్నారు. గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదని పోలీసులు తెలిపారు. కోడెల కొంతకాలంగా మనస్తాపంతో ఉన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారని పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత కోడెల మృతిపై ప్రకటన చేయనున్నట్లు తెలుస్తుంది.

ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు - డీసీపీ శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ కోడెల శివ ప్రసాద్ రావు బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఇంట్లో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని డీసీపీ శ్రీనివాస్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడారు.. క్లూస్ టీంతో ఇంట్లో తనిఖీలు చేశారు. ఆయన బెడ్‌రూంలో కిందపడి ఉంటే అతని భార్య, కుమార్తె, డ్రైవర్ కలిసి బసవతారకం ఆసుపత్రికి తీసుకువచ్చారని, ఆయన బతికించడానికి వైద్యులు ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. ఆయన మెడపై చిన్న గాయం కనిపిస్తోందని డీసీపీ అన్నారు. శవపరీక్ష తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. కొన్ని రోజులుగా ఆయన డిప్రెషన్‌లో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారని డీసీపీ అన్నారు. కాగా, ఆయన ఇంట్లో ప్రస్తుతం ఆయనతో పాటు భార్య, కూతురు, పనిమనిషి మాత్రమే ఉన్నట్లు సమాచారముందని తెలిపారు. పోస్టుమార్టం తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు.

# హిందీభాషను రుద్దాలనుకుంటే ఊరుకోం

## అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ కమలహాసన్

చెన్నై,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): ఒక దేశం ఒక భాష అంటూ కేంద్ర హోంమంత్రి, బీజేపీ జాతీయ కార్యదర్శి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే అమిత్ షా వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ సైతం మండిపడ్డారు. తాజాగా మరో తమిళ నేత, మక్కళ్‌నీది మయ్యం అధినేత కమల్ హసన్ తీవ్రంగా స్పందించారు. తమపై హిందీని బలవంతంగా రుద్దాలని చూస్తే మరో ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ వీడియోను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. 'ఒక దేశం ఒకే భాష అనే విధానం సరైనది కాదు. భారత్ ప్రజాస్వామ్య దేశం కావున ఒక దేశం అనేక భాషలు అనే సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలి. దేశ జాతీయ గీతం బెంగాలీ భాషలో ఉన్నా.. అది దేశ ఐక్యతను అన్ని రాష్ట్రాలను సంస్కృతిని గౌరవిస్తుంది. కావున దానిని మేమంతా గౌరవిస్తాం. రాష్ట్రాల సంస్కృతి జోలికి కేంద్రం రావడం సరికాదు. గతంలో జల్లికట్టు ఉద్యమాన్ని ఏ విధంగా ఉధృతంగా చేశామో దేశమంతా చూశారు. తాజాగా తమిళ భాష జోలికి వస్తే దానికి కంటే మరింత ఎక్కువగా ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నాం' అంటూ కమల్ హసన్ హెచ్చరించారు. కాగా హిందీ దివస్ సందర్భంగా అమిత్ షా ప్రసంగిస్తూ.. భారత్‌లో అత్యధికులు మాట్లాడే హిందీ భాష దేశాన్ని ఐక్యమత్యంగా ఉంచడానికి తోడ్పడుతుందని పేర్కొన్న విషయం తెలిసిందే. ప్రపంచంలో భారత్ గుర్తింపు కోసం ఒక భాష మాట్లాడాల్సిన ఆవశ్యకత ఉందని, దేశాన్ని ఒక్కటిగా ఉంచే భాష ఏదైనా ఉందంటే అది హిందీ మాత్రమే అని అభిప్రాయపడ్డారు. ఆయన వ్యాఖ్యలపై పలు రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్త చేస్తున్నాయి.

# రాష్ట్రపతి విమానంలో సాంకేతిక లోపం

## -సకాలంలో గుర్తించిన సిబ్బంది

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రయాణిస్తున్న ఎయిరిండియా వన్ విమానంలో సాంకేతికలోపం ఏర్పడింది. అయితే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి లోపాన్ని గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మూడు దేశాల పర్యటనలో ఉన్నారు. ముందుగా ఐస్లాండ్‌లో పర్యటించిన కోవింద్.. అక్కడి నుంచి స్విట్జర్లాండ్ వెళ్లారు. ఆదివారం స్విట్జర్లాండ్ పర్యటన ముగించుకుని స్లోవేనియా బయల్దేరేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం జ్యూరిచ్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే కోవింద్ ప్రయాణించాల్సిన ఎయిరిండియా వన్ విమానంలో చివరి నిమిషంలో సాంకేతిక లోపం తలెత్తింది. విమాన రూడర్‌లో సమస్య ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది వెంటనే విమానాన్ని నిలిపివేశారు. దీంతో రాష్ట్రపతి తిరిగి తన హోటల్‌కు వెళ్లిపోయారు. అనంతరం మరమ్మతులు చేపట్టిన ఎయిరిండియా ఇంజినీర్లు లోపాన్ని సరిచేశారు. అలా దాదాపు మూడు గంటల తర్వాత అదే విమానంలో రాష్ట్రపతి స్లోవేనియా వెళ్లారు.


# కాంగ్రెస్‌తో కలసి పోటీ: పవార్

ముంబయి,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): త్వరలో జరగబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) కలిసి పోటీ చేస్తాయని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ప్రకటించారు. ఎన్సీపీ 125, కాంగ్రెస్ 125 స్థానాల్లో బరిలో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. మిగిలిన 38 స్థానాల్లో చిన్న పార్టీలు పోటీలో ఉంటాయన్నారు. మహారాష్ట్రలో మొత్తం శాసనసభ స్థానాల సంఖ్య 288. అయితే ఏయే స్థానాల్లో ఎవరు పోటీ చేస్తారనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది. ఇక మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఈ నెల 19న వచ్చే అవకాశం ఉంది.

# దేశభద్రతపై షా అత్యున్నత సమీక్ష

న్యూఢిల్లీ,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): ఢిల్లీలో కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది.

అమిత్ షా నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహా దారు అజిత్ దోభాల్, హోంశాఖ కార్యదర్శి ఏకే భల్లా, ఇంటెలిజెన్స్ అధికారులు హాజర య్యారు. ఉగ్రవాద కార్యకలాపాలు, జమ్ము కశ్మీర్‌లో పరిస్థితులపై చర్చించారు. ఇక ఇదే సమావేశంలో మావోల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంపైనా చర్చలు జరిగాయి.


ఆహ్వానము

నీలి ఆకాశంలో ఎర్ర నక్షత్రం

ప్రజాన్యాయవాది

బొజ్జా తారకం

సంస్మరణ - పుస్తకావిష్కరణ సభ

19 సెప్టెంబర్ 2019, గురువారం సా॥ 4.00 గం॥లకు

మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం, రాఘవయ్య పార్క్ వద్ద, బందరు రోడ్డు, విజయవాడ

ఆహ్వానం : పిచ్చుకా శ్రీనివాస్, న్యాయవాది (ఐ.ఎ.పి.ఎల్)

అధ్యక్షత : ఎ.ఎస్.ఎస్. రాంప్రసాద్, న్యాయవాది (బెజవాడ బార్ హ్యూమన్‌రైట్స్ కమిటీ)


ముఖ్యఅతిథి : జస్టిస్ జాస్తి చలమేశ్వర్ సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

IN QUEST OF EQUALITY IN INDIAN CONSTITUTION SINCE INDEPENDENCE

పుస్తకావిష్కరణ

ప్రచురణకర్త : నరేన్ బెడిదె, దిషేర్డ్ మిర్రర్

ఆవిష్కర్త : ఎ. సత్యప్రసాద్, సీనియర్ అడ్వకేట్, హైకోర్టు




"ఇది రిజర్వేషన్ల దేశం" పుస్తకావిష్కరణ

ప్రచురణకర్త : గీతారామస్వామి హైదరాబాద్ బుక్ ట్రస్టు

వక్తలు : డి. సురేష్‌కుమార్, హైకోర్టు న్యాయవాది (సహాయకార్యదర్శి ఐ.ఎ.పి.ఎల్)

: యు.డి.జె. భీమారావు, హైకోర్టు న్యాయవాది (తారకం జూనియర్)

: మాచర్ల మోహన్‌రావు చేనేత కార్మిక నవసమాఖ్య రాష్ట్రనాయకులు

: డా॥ బొజ్జా మహిత బొజ్జా తారకం ట్రస్టు

: డా॥ బోయి నాగవర్మ బొజ్జా తారకం ట్రస్టు

: భీమ్రేడ్ కంచర్ల శేషు ఆర్.పి.ఐ. ఆంధ్ర రాష్ట్ర కో-ఆర్డినేటర్

ప్రజా కళాకారుడు జనం డప్పుల చప్పుడు డప్పు రమేష్ బృందంచే కళాప్రదర్శన

బొజ్జా తారకం ట్రస్టు, హైదరాబాద్ బుక్ ట్రస్టు

భారత ప్రజాన్యాయవాదుల సంఘం (ఐ.ఎ.పి.ఎల్)

Indian Association of Peoples Lawyers

9849770625, 9885177757, 9441441891

# తారాస్థాయికి సర్కార్ వేధింపులు

## పులిలాంటి కోడెలకే తప్పలేదు

### మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆవేదన

గుంటూరు,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ఏపీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మృతి వార్త విని టీడీపీ నేత, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు కన్నీటి పర్యంతమయ్యారు. కోడెల చాలా ధైర్యవంతుడని, అలాంటి వ్యక్తి.. వైసీపీ ప్రభుత్వం వేధింపులతో మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. కోడెల ఆత్మహత్య చేసుకోడానికి వేరే కారణాలు లేవని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కోడెలపై వేధింపులు చూస్తున్నామని అన్నారు. ఆయన కేవలం ప్రభుత్వ వేధింపులవల్లే ఆత్మహత్య చేసుకున్నారనేది యదార్థమని ఆనందబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. కోడెల చావుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి వేధింపులు చూడలేదని కోడెల తనతో చెప్పారని నక్కా ఆనందబాబు చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒకటైపని, జగన్ మరో టైపని అన్నారని.. జగన్ వేధింపులు చాలా భయంకరంగా ఉన్నాయని.. ఎంతవరకు వెళతాయో అర్థంకావడంలేదని తనతో చెప్పుకుని వాపోయారన్నారు. కోడెల లాంటి వ్యక్తే ఆత్మహత్యకు పురిగొల్పేలే ప్రభుత్వం సృష్టించిందంటే.. సామాన్య కార్యకర్తలు ఇంకా భయపడిపోతారని ఆనందబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక నుంచి టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కోడెల మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. గుంటూరు జిల్లాకు ఆయన టైగర్ అని, 37 ఏళ్ల రాజకీయ జీవితంలో.. ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇదిలావుంటే కోడెల శివప్రసాద్ ఆత్మహత్యపై మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందించారు. ప్రభుత్వ వేధింపుల వల్లే కోడెల బలవన్మరణానికి పాల్పడ్డారని ఆరోపించారు. తనపై ఎన్నో కేసులు పెట్టి వేధిస్తున్నారని కోడెల అనేకసార్లు వాపోయారని పేర్కొన్నారు. కోడెల పోరాట యోధుడు అని, రైతు సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. అలాంటి నాయకుడిపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని వైసీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

# ఛానళ్లు నిలిపివేయడంపై ఆందోళన

### పార్టీలు,ప్రజాసంఘాలతో కలసి జర్నలిస్టుల నిరసన

విజయనగరం,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ఎబిఎన్, టివి 5 ఛానళ్ల ప్రసారాలను నిలిపివేయడాన్ని నిరసిస్తూ.. జర్నలిస్టు సంఘాలు ఆందోళన చేపట్టాయి. సోమవారం పట్టణంలో ఉన్న ఆర్టీసీ కూడలి వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల పార్టీ నాయకులు, టిడిపి నేతలు జర్నలిస్టు ల నిరసనలకు మద్దతు తెలిపారు. నిరసన అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, సబ్ కలెక్టర్ కారార్యలయ ఎవో కు వినతిపత్రాన్ని అందచేశారు. మరో వైపు.. కొత్తవలసలో ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. కొద్ది రోజులుగా ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టీవీ 5 ఛానల్ ఎంఎస్ఒలు నిలిపివేయడం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనని శృంగవరపుకోట పాత్రికేయులు గళమెత్తారు. సోమవారం ఉదయం ఎపిడబ్ల్యూజెఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక దేవికూడలి వద్ద శృంగవరపు కోట మండల నియోజకవర్గ పాత్రికేయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మోకాలిపై నిలబడి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా.. నినాదాలు చేశారు. నిలిపివేసిన ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టీవీ 5 ప్రసారాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పాత్రికేయులం తా ర్యాలీగా వెళ్లి స్థానిక తహశీల్దార్ ఎల్.రామారావు కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ చిన్న పత్రికల సంఘాలకు చెందిన అశోక్ కుమార్, శీరాపు శ్రీనివాసరావు, కాకి వీరారెడ్డి, బికె.నాయుడు, పియస్.కుమార్, రవి, బాపు నాయుడు, పెనుమత్స సురేష్ రాజు, చింత వెంకట రమణ మూర్తి, గోవింద రాజు, పి.సుబ్రహ్మణ్యం, సతీష్,పాల్గొన్నారు.

# టాయ్‌లెట్‌లో మృతశిశువు దేహం

వెల్లూరు,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): తమిళనాడులో విషాద సంఘటన చోటుచేసుకుంది. వెల్లూరు జిల్లాలోని వనియంబాడి ప్రభుత్వ ఆసుపత్రిలోని టాయిలెట్లో నవజాత శిశువు మృతదేహాన్ని పడేయడం కలకలం రేపింది. ఆదివారం ఆసుపత్రిలోని టాయిలెట్లను శుభ్రం చేయడానికి వెళ్లిన మహిళ వార్డెన్.. లేడిస్ టాయిలెట్లో ఆడ శిశువు మృతదేహాన్ని గుర్తించింది. అక్కడ పడేసిన ఒక సంచిలో శిశువు తల కనిపించడంతో వెంటనే ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించింది. ఆసుపత్రి అధికారులు ఆ సంచిని స్వాధీనం చేసుకొని శిశువు మృతదేహాన్ని బయటకి తీసి శవపరీక్ష కోసం ల్యాబ్ కు పంపారు. అనంతరం పోలీసులకు సమాచరం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులే శిశువు మృతదేహాన్ని ఇక్కడ పడేసినట్లు ఆసుపత్రి వైద్య అధికారి అంబిగా శ్రీనివాసన్ తెలిపింది. నిందుతులను గుర్తించేందుకు ఆసుపత్రిలోని సిసిటివి ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


ఆచార్య రాజాజీ స్కూల్ ఆఫ్ పెయింటింగ్
రాజమహేంద్రవరం

ఆహ్వానము

ప్రముఖ చిత్రకారులు కీ॥శే॥ ఆచార్య రాజాజీ జయంతి సందర్భంగా
శ్రీ ఎల్లా సుబ్బారావుగారి చిత్రకళా ప్రదర్శన
మరియు
'సువర్ణ తూలిక' గ్రంధావిష్కరణ
(శ్రీ ఎల్లా సుబ్బారావు గారి జీవితం- కళా ప్రస్థానంపై అక్షర – చిత్ర మాలిక)

తేది: 2-10-2019
సమయం : ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 8 గం॥ల వరకు

వేదిక :
విజయవాడ కల్చరల్ సెంటర్
మొగల్‌రాజపురం, విజయవాడ

ఆర్టు గ్యాలరీ ప్రారంభం: ఉదయం 10 గం॥లకు

ర్టు గ్యాలరీ ప్రారంభకులు / ఖ్య అతిథి : ఆచార్య జి. శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్, N.T.R. పశువైద్య కళాశాల, గన్నవరం
ంథావిష్కరణ : సాయంత్రం 4 గంటలకు
భాధ్యక్షులు : డా॥ తూములూరి రాజేంద్ర ప్రసాద్, వ్యవస్థాపక అధ్యక్షులు, డా॥ పట్టాభి కళా పీఠము
శిష్ట అతిథి / ంథావిష్కర్త : శ్రీ ఐ.వి. రమణయ్య, డైరక్టర్, దూరదర్శన్ కేంద్రం-విజయవాడ
త్మీయ అతిథి / లి ప్రతి స్వీకర్త : డా॥ ఈమని శివనాగి రెడ్డి, C.E.O., The Cultural Centre of Vijayawada, Amaravathi

ఆత్మకూరు రామకృష్ణ
కవి-చిత్రకారులు
గ్రంథ రచయిత
ఫోన్ : 94934 05152

ఎల్లా సుబ్బారావు
వ్యవస్థాపక అధ్యక్షులు,
ఆచార్య రాజాజీ స్కూల్ ఆఫ్ పెయింటింగ్
ఫోన్ : 99893 34383


# ఘరానా దొంగ అరెస్ట్

### మోసపూరిత మాటలతో దొంగతనాలు

కాకినాడ,సెప్టెంబర్17 (ఆర్ ఎ న్ఎ): రాజోలు పరిధిలోని మలికిపురం మండలంలోని వివిధ ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడిన పాత నేరస్థుడు మలికిపురం పోలీసులకు చిక్కాడు. సఖినేటిపల్లి గ్రామానికి చెందిన ఇంజేటి ఆనందబాబు పలు దొంగతనాల కేసుల్లో నిందితుడు. మలికిపురం మండలంలోని శంకర గుప్తం, లక్కవరం, విశ్వేశ్వరాయపురం గ్రామాల్లో ఆనందబాబు దొంగతనాలకు పాల్పడ్డాడు. సోమవారం రాజోలు సర్కిల్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజోలు సిఐ నాగ మోహనరెడ్డి వివరాలను వెల్లడించారు. గతంలో సఖినేటపల్లి పోలీస్ స్టేషను పరిధిలో పలు దొంగతనాల కేసులో జైలుకు వెళ్ళినప్పటికీ ఆనందబాబు ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో అతన్ని అనుమానించామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్, ఆగస్టు నెలలలో మలికిపురం మండలంలోని శంకర గుప్తం, లక్కవరం, విశ్వేశ్వరాయ పురం గ్రామాలలో జరిగిన దొంగతనాలు ఆనందబాబే చేసుంటాడనే అనుమానంతో మలికిపురం ఎస్ఐ కెవి.రామారావు నిఘా ఉంచారని తెలిపారు. దీంతో ఆదివారం మలికిపురం మండలం గుడిమెళ్లంకలో ఆనందబాబు తిరుగుతుండగా మలికిపురం ఎస్ఐ అరెస్టు చేసి విచారణ చేపట్టారని అన్నారు. నిందితుడి వద్ద నుండి 65 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ.15 వేల నగదు ను స్వాధీనం చేసుకున్నామని తెలిపి వాటిని విలేకరులకు చూపారు. మొత్తం వీటి విలువ రూ.2.36 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. వీటిని రాజోలు జూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సిఐ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన అమలాపురం డిఎస్పీ ఎస్.కె.మసుమ్ భాషా పర్యవేక్షణలో రాజోలు సిఐ నాగ మోహనరెడ్డి ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకున్న మలికిపురం ఎస్ఐ రామారావు, సిబ్బందిని ఇఐ అభినందిస్తూ రివార్డు నిమిత్తం పై అధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. ఇదిలావుంటే ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధుల వద్దకు వెళ్లి మాయమాటలతో బంగారు ఆభరణాలు అపహరించుకెళ్తున్నట్లు నిందితుడు ఆనందబాబు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరుకు ఫోటోలు తీయాలంటూ నమ్మించడం.. ఆ సమయంలో శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలు తీసేయాలని లేకపోతే పింఛను పొందేందుకు అర్హత కోల్పోతారంటూ నగలను చేతపట్టుకుని దొంగతనాలకు పాల్పడటం వృత్తి గా చేసుకున్నాడని చెప్పారు. మాయమాటలు చెప్పే అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని రాజోలు సిఐ నాగ మోహనరెడ్డి ప్రజలను కోరారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే దగ్గరలో ఉండే పోలీస్ స్టేషను లో ఫిర్యాదు చేయాలని కోరారు.

# ఆటోవాలాలకు ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్

విజయనగరం,సెప్టెంబర్17 (ఆంఎన్ఎ): ప్రతి ఆటోవాలా కెస్ట్ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్లో ఎన్‌రోల్‌మెంట్ చేయించుకోవాలని సాలూరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎఎస్ గణెళిష్ రెడ్డి సూచించారు. మండలంలోని పెదమానాపురం సంత తోటలో ఉన్న ఆటో స్టాండ్ వద్ద సోమవారం ఆటో డ్రైవర్లతో ఎఎస్ గణెళిష్ రెడ్డి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాలూరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎఎస్ గణెళిష్ రెడ్డి ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. మీ సేవలో అప్లికేషన్ నింపిన చోట క్యాస్ట్ సర్టిఫికెట్ లేకపోతే ఆ కాలం వద్ద నో అని నింపాలని సూచించారు. ఆటో డ్రైవర్‌కు లైట్ మోటార్ వెహికల్ లైసెన్సు ఉంటే సరిపోతుందని, తద్వారా ప్రతి ఆటోవాలా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 10 వేల రూపాయలకు అర్హులుగా ఉంటారని చెప్పారు. ఈ నెల 25 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఆ తారీకు లోగా శత శాతం ఆటో డ్రైవర్లంతా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రము లేని వారు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ వాలంటీర్ల ద్వారా సర్టిఫికెట్లు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాలూరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎఎస్ గణెళిష్ రెడ్డి తో పాటు సిబ్బంది మూర్తి, కోమటిపల్లి, మానాపురం స్టాండ్ లకు కు చెందిన ఆటో డ్రైవర్లు పాల్గన్నారు.

## ఏపీ వార్తలు

# కేసులతో ఆత్మగౌరవం దెబ్బతీసారు

### సాయం పొందిన వారే దెప్పి పొడిచారు

### కోడెల ఆత్మహత్యపై సన్నిహితుల ఆవేదన

గుంటూరు,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): పల్నాటి పులిగా సుపరిచితుడైన కోడెలను.. తన కుటుంబ సభ్యులపై వైసీపీ ప్రభుత్వం నమోదుచేసిన వరుస కేసులు ఉక్కిరిబిక్కిరి చేశాయనే చెప్పాలి. రాజకీయంగా కేసులుం టే తేల్చుకు నేందుకు కోడెల సిద్దపడినా వ్యక్తిత్వ హననం జరగడాన్ని జీర్ణించుకోలేదని ఆయన సన్నిహితులు వాపోతు న్నారు. కోడెల జీవితం ఇలా అర్ధాంతరంగా ముయడాన్ని వారు తట్టుకోలేకపోతున్నారు.వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి ఆయన కుటుంబంపై చేసిన ట్వీట్లు ప్రజల్లో ముఖ్యంగా రాజకీయ ప్రత్యర్థుల్లో తనను చులకన చేశాయని కోడెల ఎంతో ఆవేదన చెందారు. దీనికి తోడు మంత్రు లు, స్థానిక ప్రజాప్రతినిధులు కోడెల కుటుంబంపై కక్ష కట్టి వేధింపులకు పాల్పడ్డారు. వారి ప్రకటనలతో అనేక మంది నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయడం ప్రారంభమైంది. పోలీసులు కనీసం వాటిలోని నిజానిజాలను, ఆధారాలను పరిశీలించకుండా కేసులు నమోదు చేశారు. చివరకు రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో చీటింగ్ కేసుల్లో నిందితుడైన రంజీ క్రికెటర్ బుడుమూరు నాగరాజు సైతం కోడెల కుటుంబంపై ఫిర్యాదు చేయడమే కాక మీడియా ముందుకొచ్చి తీవ్ర ఆరోపణలు చేశాడు. మొత్తమ్మీద 21 కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసుల్లో మాత్రమే కోడెలను నిందితుడిగా పేర్కొన్నారు. మిగతావన్నీ ఆయన కుటుంబ సభ్యులపై నమోదయ్యాయి. ఈ పరిణామాలు ఆయన్ను తీవ్రంగా కలిచివేశాయని సన్నిహితులు ఆవేదన చెందు తున్నారు. స్పీకర్‌గా ఉన్న సమయంలో కోడెల నుంచి సాయం పొందిన వైసీపీ నాయకులు.. తమ పార్టీ ఆయనపై కక్ష కట్టినప్పుడు పట్టించుకోలేదు. రాజకీయంగా ఎంతైనా పోరాడవచ్చని.. కానీ వ్యక్తిగత ఇమేజిని దెబ్బ తీయడం సరికాదని ఆయన వారికి వర్తమానం పంపినా తిరుగు సమాధానమే రాలేదు. ఈ విషయాలు కూడా ఆయనే వెల్లడించారు. వైసీపీ ముఖ్య నేత విజయ సాయిరెడ్డి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు కోడెల అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నారు. విజయసాయి నామినేషన్ పత్రంలో సమస్యలు ఉన్నాయని, ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదలొచ్చాయి. విజయసాయి భయపడ్డారు. కోడెలను కలిసి ఇది అన్యాయ మని, తన నామినేషన్ తిరస్క రించకుండా సాయం చేయాలని కోరారు. కోడెల వెంటనే స్పందిం చారు. రిటర్నింగ్ అధికారిగా ఉన్న అసెంబ్లీ అధికారితో మాట్లాడారు. ఏదైనా ఉంటే రాజకీయంగా ఎవరి పోరాటం వారు చేసుకుం టామని, ఏవో ఫిర్యాదుల ఆధారం గా నామినేషన్ తిరస్క రించడం సరికాదని గట్టిగా చెప్పారు. మొత్తానికి విజయసాయి నామినేషన్ నిలిచింది. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో కోడెల తనకు చేసిన సాయం చాలా విలువైందని కొందరు సన్నిహితులకు విజయసాయి చెప్పినట్లు సమాచారం. అసెంబ్లీ ఫర్నిచర్ వివాదం తలెత్తిన తర్వాత విజయసాయిరెడ్డితో కోడెల తనకు తెలిసిన వారితో మాట్లాడించారు. తన విషయంలో చాలా అన్యాయంగా వ్యవహ రిస్తున్నారని, జోక్యం చేసుకోవాలని కోరారు. కానీ స్పందన లేదని కోడెల సన్నిహిత వర్గాలు తెలిపాయి. పైగా విజయసాయే దారుణమైన ట్వీట్లు చేయడం కోడెలను నివ్వెరపచింది. ఇవన్నీ కూడా కోడెలను జీవితంపై విరక్తి చెందేలా చేశాయని అంటున్నారు. ఆయన ఆత్మహత్యకు అధికార వైకాపాదే బాధ్యతని అంటున్నారు.

# ప్రభుత్వ కక్షసాధింపు వల్లనే కోడెల ఆత్మహత్య

### ఆయన మృతికి ప్రభుత్వానిదే బాధ్యత

### పులిలాంటి వ్యక్తి అవమానాలు భరించలేక పోయాడు: చంద్రబాబు

గుంటూరు,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): వైసిపి ప్రభుత్వం వేధింపుల కారణంగానే మాజీ అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకున్నారని టిడిపి జాతీయ అధ్యక్షుడు, ఎపి మాజీ సిఎం చంద్రబాబు ఆరోపించారు. కోడెల మృతిని తాను జీర్ణించుకోలేకపోతున్నట్టు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ వేధింపుల కారణంగా కోడెల చాలా మానసిక క్షోభ అనుభవించారని ఆయన తెలిపారు. గుంటూరులో చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ కోడెలకు భయమంటే ఏమిటో తెలియదని, వైకాపా ప్రభుత్వం చేస్తున్న అవమానాలను, వేధింపులను కోడెల భరించలేకపోయారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కోడెల మృతిపై మీడియాతో మాట్లాడుతున్న సమయంలో చంద్రబాబు ఉద్వేగానికి గురై కంటతడి పెట్టారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి వేధింపులు సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలను వేధిస్తున్న జగన్ ప్రభుత్వ తీరును ప్రజలు ఎండగట్టాలని ఆయన కోరారు. కోడెల మృతి వార్తను తనకు నటుడు, ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ ఫోన్ చెప్పారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు కోడెలకు నివాళులు అర్పించారు. గత మూడు నెలల నుంచి కోడెల శివప్రసాదరావుకు వేధింపులు ఎక్కవయ్యాయని, వాటిని భరించలేకనే ఆయన ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని చంద్రబాబునాయుడు అన్నారు. గతంలో పల్నాడు ప్రాంతానికి తాను వెళ్లినప్పుడు 'పల్నాడు పులి కోడెల' అనే స్లోగన్స్ వినపడేవని, ఒక టైగర్ లా ఆయన బతికారని అన్నారు. పార్టీకి ఎనలేని సేవలు చేసిన వ్యక్తి అని కొనియాడారు. 'సమస్యలు వస్తాయి. పోరాడదాం' అని అనేకసార్లు కోడెలకు చెప్పాను కానీ, 'ఎక్కడో మనిషి అవమానాన్ని భరించలేకపోయాడు' అని, ఆ అవమానాన్ని భరించలేక తనకు నిద్ర కూడా రావడం లేదని కోడెల తనతో గతంలో రెండు మూడు సార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. 'ధైర్యంగా ఉండు. అధైర్యపడొద్దు. ఇవన్నీ వాళ్లు కావాలని చేసినప్పుడు మీరు ధైర్యంగా ఫేస్ చేసి, రాష్ట్రంలోని కార్యకర్తలకు గానీ ప్రజలకు గానీ ఒక నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందని' కోడెలకు చెప్పినట్టు చంద్రబాబు పేర్కొన్నారు. ఎలాంటి సంక్షోభాన్ని అయినా, ఇబ్బంది అయినా ఎదుర్కొన్న కోడెల తనకు జరిగిన అవమానాన్ని తట్టుకోలేకపోయారని అన్నారు.

# గోదావరిలో కొనసాగిని గాలింపు

### ఇంకా పలువురి మృతదేహాలు అలభ్యం

రాజమండ్రి,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ):గోదావరిలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన వారి ఆచూకి ఇంకా దొరకలేదు. రెండో రోజూ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నదిలో వరద ఉధృతి కారణంగా గాలింపు చర్యలు ఫలించట్లేదు. గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు 256 మందితో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఆయిల్ మరకల ఆధారంగా బోటు మునిగిపోయిన ప్రాంతాన్ని గుర్తించినట్లు సమాచారం. 300 అడుగుల లోతులో బోటును గుర్తించినట్లు తెలుస్తున్నది. బోటు కింద మరిన్ని మృతదేహాలు లభించే అవకాశముందని గాలింపు బృందాలు చెబుతున్నాయి. గల్లంతైన వారిలో చాలా మంది లాంచీలో చిక్కుకుపోయి ఉండే అవకాశముందని ఎన్డీఆర్ఎఫ్ భావిస్తోంది. ఇప్పటివరకు 12 మృతదేహాలు దొరికాయి. ఇవాళ గాలింపు చర్యలో 4, నిన్న 8 మృతదేహాలు లభించాయి. 9 మంది సిబ్బంది, 64 మంది పర్యాటకులతో కలిపి మొత్తం 73 మందితో బోటు పాపికొండల టూర్‌కి బయలుదేరింది. ఇప్పటి వరకు 26 మంది సురక్షితంగా బయటపడగా ఇంకా 39 మంది ఆచూకి లభించాల్సి ఉంది.

ఇద్దరు యువ ఇంజనీర్ల మృతి

పాపికొండలు విహార యాత్ర దగ్గర జరిగిన పడవ ప్రమాదంలో మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలానికి చెందిన ఇద్దరు యువ ఇంజనీర్లు గల్లంతు కావడంతో ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన వారి తల్లిదండ్రులు ఘటనా స్థలానికి బయలుదేరారు. గల్లంతైన వారి ఇంటి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. గత రాత్రి కర్ణమామిడికి చెందిన లక్ష్మణ్ మృతదేహం లభించడం.. మరొక మహిళ ఇంజనీర్ రమ్యశ్రీ గల్లంతు కావడం ఇద్దరు విద్యుత్ శాఖలో పనిచేసే ఇంజనీర్లు ఉద్యోగంలోకి చేరి ఏడు నెలలు కాకముందే మృత్యువాత పడడంపై కర్ణమామిడి గ్రామంలో గ్రామస్తులు లక్ష్మణ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. నన్నూరు కు చెందిన రమ్య శ్రీ గల్లంతు ఆచూకీ తెలియకపోవడంతో ఇంటి వద్దే ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇంజనీర్ దినోత్సవం రోజు ఇద్దరు యువ ఇంజనీర్లు ఇలాంటి ఘోర ప్రమాదానికి గురికావడం పట్ల సహ ఇంజనీర్లు విచారం వ్యక్తం చేశారు.

# ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు పంపిణీ

### స్పందనలో సమస్యలకు పరిష్కారం

### మంత్రి కృష్ణదాస్ వెల్లడి

శ్రీకాకుళం,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): శ్రీకాకుళంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా.. సోమవారం విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కృష్ణదాస్ మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమం అత్యంత ప్రజాదరణ పొందిందన్నారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని హర్షాన్ని వ్యక్తపరిచారు. గోదావరి దుర్ఘటన దురదృష్టకరమని, బాధిత కుటుంబాలకు తన సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. మఅతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ప్రకటించిందన్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే నిర్వహించారని అన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్ళ ను ఆర్ అండ్ బి శాఖ మంత్రి డి. కృష్ణదాస్ పంపిణీ చేశారు.

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్పందన కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ స్వయంగా హాజరై, జిల్లా కలెక్టర్ తో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి బలివాడ దయానిధి, డిఆర్డీఏ పిడి ఏ.కళ్యాణ చక్రవర్తి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి హెచ్.కూర్మారావు, ఎస్డీసి ఆర్.గున్నయ్య, ఇపిడిసియల్ ఎస్ఇఎన్.రమేష్, ఆర్.డబ్ల్యూఎస్ ఎస్ఇ టి.శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి కెవి.ఆదిత్య లక్ష్మి, బిసి కార్పొరేషన్ ఇడి జి.రాజారావు, మత్స్య శాఖ జెడి డాక్టర్ వివి కృష్ణమూర్తి, ఇతర జిల్లా అధికారులు పాల్గన్నారు. స్పందనలో శ్రీకాకుళం మాజీ శాసన సభ్యురాలు గుండ లక్ష్మీదేవీ నుండి మంత్రి అర్జీలను స్వీకరించారు.డయల్ యువర్ కలెక్టర్ కు 17 వినతులు అందాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎ.కళ్యాణ్ చక్రవర్తి డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించారు.

# రెండు ఆర్టీసీ బస్సులు ఢీ: పలువురికి గాయాలు

ఏలూరు,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు సమీపంలో కృష్ణ జిల్లా పరిధిలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి.

సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో బస్సుల్లోని దాదాపు 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

గాయపడిన వారందరినీ ముందుగా ప్రథమ చికిత్స కోసం ఆకివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

ఏపీ వార్తలు

# కడప ఉక్కు సీమహక్కు

## విస్మరించిన వారికి గట్టిగా బుద్ధి చెబుతాం

కడప,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): కడప ఉక్కుపరిశ్రమ రాయలసీమ హక్కు అని రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు అన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే రాయలసీమ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కరవు, కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుందని అన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించి అభివృద్ధి చేయాలని, సీమలోని నాలుగు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమను స్థాపించాలని డిమాండ చేసారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని వారు కోరారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక యువత, సరైన మౌలిక వసతుల కల్పన లేక సీమవాసులు నిత్యం కరవు కోరల్లో చిక్కుకుంటున్నారు. సీమలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రూ.50 వేల కోట్ల ప్యాకేజీ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తదితర డిమాండ్ల సాధనకు చేస్తున్న పోరాటాలతో ప్రజల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ, సీమకు రూ.50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి అంశాలను సాధించేంత వరకు యువత పిడికిలి సడలించవద్దని యువతకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలియ జేశారు. సీమాభివృద్ధికి రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.ప్రజా ఉద్యమాల ద్వారా అభివృద్ధి సాధ్యమని, ఉక్కు పరిశ్రమ స్థాపించే వరకు ఉద్యమాలను ఉధృతం చేయాలని సూచించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మొండివైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు అయ్యేంత వరకు పాలకవర్గాలను నిద్రపోనివ్వమని హెచ్చరించారు.

# జిల్లాను వణికిస్తున్న విష జ్వరాలు

## డెంగీ భయంతో ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగు

అనంతపురం,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): డెంగీ జ్వరాలు అనంతను వణికిస్తున్నాయి. స్వచ్ఛభారత్ డొల్లతనాన్ని బయటపెట్టింది. ఈ కార్యక్రమం కేవలం ప్రచారానికే పరిమితం అయ్యింది. పట్టణంలో పారిశుద్యం కొరవడి డెంగీ విజృంభించడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. పందులను పట్టణంలో లేకుండా చేయడం, పారిశుద్యం కల్పించి దోమల నివారణకు తీసుకున్న చర్యలు ఫలించలేదు. అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలు శూన్యంగా ఉన్నాయి. దీనికితోడు వ్యాధుల తీవ్రతతో వచ్చే వారినుంచి ప్రైవేట్ ఆస్పత్రులు దోపిడీకి పాల్పడుతున్నాయి. డెంగీ వ్యాధి నిర్ధారణకు సంబంధించి జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు సంబంధించి మొదటిది ర్యాపిడ్, రెండోది ఎలీసా టెస్ట్లు చేయాల్సి ఉంటుంది. ర్యాపిడ్ టెస్ట్లో మూడు రకాలు ఉంటాయి. ఈ టెస్ట్లలో పాజిటివ్ వస్తే ఎలీసా పరీక్ష చేస్తారు. ఎలీసా టెస్ట్ చేయాలంటే మెడికల్ కాలేజీ లేదా హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గుర్తించాలిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా మలేరియా అధికారి సూచిస్తున్నారు. విష జ్వరాల బారిన పడిన చాలా మంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. వ్యాధి నిర్ధారణకు సంబంధించి స్పష్టత లేకున్నా... ప్రజల బలహీనతను ఆసరా చేసుకున్న ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ర్యాపిడ్ టెస్ట్లు నిర్వహిస్తూ తాము సరైన చికిత్స అందిస్తామని సొమ్ము చేసుకుంటున్నాయి. పరిస్థితి విషమించినప్పుడు చేతులెత్తేసి, మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. అప్పటికే వ్యాధి ముదిరిపోవడంతో రోగులను బెంగళూరుకు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోంది. జిల్లా వ్యాప్తంగా హైరిస్క్ కేసులు ఉన్నట్లు గుర్తించారు. అయితే జిల్లాలో ఏ ఒక్కరూ డెంగీతో మృతి చెందలేదని పేర్కొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం..

# సమగ్ర విచారణ జరపాలి

**– కోడెల మృతిపై రకరకాల కథనాలు వస్తున్నాయి**

**– మంత్రి బొత్స సత్యనారాయణ**

అమరావతి,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): కోడెల మరణం పట్ల మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. కోడెల కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ స్పీకర్ అయిన కోడెల మరణం గురించి సమగ్రంగా విచారణ జరపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కోడెల మరణం గురించి రకంకాల వార్తలొచ్చాయన్న బొత్స.. ముందుగా ఓ న్యూస్ ఛానల్లో గుండెపోటు కారణమని ప్రసారం చేశారన్నారు. తర్వాత అదే ఛానల్లో ప్రమాదకర ఇంజెక్షన్లు వేసుకున్నారని మరో వార్త వచ్చిందన్నారు. కోడెల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నారని కొన్ని మీడియా సంస్థలు ప్రసారం చేశాయని, సీనియర్ రాజకీయ నాయకుడైన కోడెల మరణంపై రకరకాలుగా ప్రచారం జరుగుతోందన్నారు. కాబట్టి కొడెల మరణంపై సమగ్ర విచారణ జరపాలని బొత్స తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. సాక్ష్యాలు తారుమారు కాకుండా చూడాలన్నారు. నిమ్స్, కేర్ లాంటి ఎన్నో హాస్పిటల్స్ ఉండగా.. కోడెలను బసవతారకం కేన్సర్ హాస్పిటల్కు ఎందుకు తీసుకెళ్లారు..? అని ప్రశ్నించారు. కోడెల మరణం వెనుక కారణాలేంటి? కుటుంబ కలహాలా, ఇతరత్రా కారణాలు ఉన్నాయా? అనేది తేలాల్సి ఉందన్నారు బొత్స. పల్నాడు ప్రాంత ప్రజానీకం ఫిర్యాదులపైనే ఆయనపై కేసులు పెట్టారు. ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేయలేదు, ఇబ్బంది పెట్టలేదని తెలిపారు. బాధితులు కోడెల మీద ఫిర్యాదు చేశారు కానీ... ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టలేదని మంత్రి స్పష్టం చేశారు.

**జనాలకు ముఖం చూపలేకే చనిపోయి ఉంటాడు – మంత్రి పిల్లి సుభాష్**

కోడెల మృతిపై మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆస్తిని దొంగిలించినందుకు.. జనాలకు ముఖం చూపలేకే ఆయన చనిపోయి ఉంటారన్నారు. దొంగతనం ఎవరు చేయమన్నారు? ఎవరు చనిపోమన్నారు? దురదృష్టం అని పిల్లి సుభాష్ చంద్రబోన్ వ్యాఖ్యానించారు. ఆయన మరణానికి రాజకీయ వేధింపులు కారణం కాదన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రతలే ముఖ్యం

ఏలూరు,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): వ్యక్తిగత పారిశుద్యంతోనే అంటువ్యాధులకు దూరంగా ఉండగలమని వైద్యాధికారులు అన్నారు. ప్రతి ఒక్కరు ఇందుకు కృషిచేయాలన్నారు. డెంగీ, గున్యా జ్వరాలకు ఇదే విరుగడని అన్నారు. అలాగే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణపై నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో ప్రజలు ముందుండాలని అన్నారు. పురపాలక సంఘాలు, నగర పాలకసంస్థల పరిధిలో ప్రజలను చైతన్యం చేయాలని చెప్పారు. వార్డులవారీగా వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరైన లబ్దిదారులంతా నిర్మించేలా చైతన్యపరిచేందుకు ఇన్ఛార్జులుగా నియమించిన సిబ్బంది లక్ష్యం సాధించేలా కృషి చేయాలని హెచ్చరించారు. నూరుశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం జరిగేలా చూడాలన్నారు.

# కోడెల మృతికి ప్రభుత్వమే కారణం: సుజనా

విజయవాడ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ మృతిపై బీజేపీ ఎంపీ సుజనా చౌదరి స్పందించారు. కోడెల మృతి బాధాకరం అన్నారు. కోడెల పల్నాటి పులి అని వ్యాఖ్యానించారు. కోడెల మృతికి ప్రభుత్వమే కారణమని పరోక్షంగా ఆరోపించారు. నేతలపై రాజకీయ వేధింపులు సరికాదన్నారు. ప్రభుత్వం వేధిస్తోందని కోడెల శివప్రసాద్ నిత్యం ఆవేదన చెందేవారన్నారు. కేసుల మీద కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమో ప్రభుత్వ పెద్దలు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎంపీ సుజనా చౌదరి హితవు చెప్పారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆత్మహత్యపై మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ ముఖ్యమంత్రి కుటుంబాన్ని ఢీకొట్టడం ఎంత కష్టమో తనకు తెలుసని వ్యాఖ్యానించారు. కోడెల ఓ వ్యక్తిగా మొదలై వ్యవస్థగా విస్తరించిన నాయకుడంటూ తుమ్మల కొనియాడారు.

# గిరిజనుల నుంచి డబ్బుల వసూళ్లపై ఫిర్యాదు

విజయనగరం,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): స్మార్ట్ పల్స్ సర్వే పేరుతో గిరిజనుల వద్ద డబ్బు వసూలు చేశారంటూ.. గుమ్మలక్ష్మీపురం తహాశీల్దార్కు గిరిజనులు సోమవారం ఫిర్యాదు చేశారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో స్మార్ట్ పల్స్ సర్వే పేరుతో నెల్లి కెక్కువ, వాడపుట్టి, కొండకూనేరు గ్రామాల్లో ఆధార్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరి నుంచి ఒక్క రూపాయి చొప్పున 30 రూపాయలు చొప్పున వసూలు చేశారని మాజీ ఎంపిటిసి తాడంగి లక్ష్మణరావుకు గిరిజనులు భాస్కరరావు, తిరుపతిరావులు తెలిపారు. గిరిజన గ్రామాల్లో సర్వేల పేరుతో వచ్చిన సిబ్బంది అమాయకులైన గిరిజనుల నుండి ఇలా డబ్బులు వసూలు చేయడం విచారకరమని మాజీ ఎంపిటిసి తాడంగి లక్ష్మణరావు పేర్కొన్నారు.

## మాదిగల పోరాటం ఆగదు

విజయవాడ,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): ఎస్సీ వర్గీకరణ సాధనకోసం మాదిగల ధర్మ యుద్ధం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు వెల్లడించారు. వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ నిర్వహించిన ఆందోళన సందర్భంగా కేంద్రం సానుకూలత వ్యక్తం చేసిందని అన్నారు. వర్గీకరణ సాధిస్తే రాబోయే తరాల భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఎంతోకాలంగా జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనడానికి ఇదొక్కటే మార్గమని అన్నారు. ఈ ప్రభుత్వాలు ఎప్పటికైనా కళ్లు తెరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మాలమహానాడు నాయకులు తమ జాతికి ఏమాత్రం ఉపకారం చేయకపోగా వివిధ వివిధ పార్టీల్లో ఉంటూ పదవులు అనుభవిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు చేపట్టనున్న పోరనాటాలతో ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటిమంది మాదిగలు, ఇతర ఉపకులాల కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందని తెలిపారు.

# తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊహించని షాక్

**ఎర్రమంజిల్ భవనాల కూల్చివేత తగదని తీర్పు**

**అసెంబ్లీ నిర్మాణంపై మంత్రి మండలి తీర్మానం చెల్లదని స్పష్టీకరణ**

**పురాతన భవనాల కూల్చివేతను తప్పుపట్టిన ధర్మాసనం**

**హైకోర్టు తీర్పుతో మొదటికొచ్చిన అసెంబ్లీ నిర్మాణం**

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊహించని షాక్ తగిలింది. ఎర్రమంజిల్లోని పురాతన భవనాలను కూల్చి నూతన అసెంబ్లీని నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టిపారేసింది. ఈ మేరకు మంత్రిమండలి చేసిన తీర్మానాన్ని కోర్టు తిరస్కరించింది. అసెంబ్లీ నిర్మాణం కోసం ప్రస్తుత ఎర్రమంజిల్లోని చారిత్రాత్మక భవనాలను కూల్చి ఆ స్థానంలో కొత్త భవనాలకు తెలంగాణ ప్రభుత్వం భూపూజ కూడా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంత్రివర్గం కూడా ఏకగ్రీవం తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో ఎర్రమంజిల్ భవనాలను కూల్చాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ.. హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటినీ కలిపి ఉమ్మడిగా విచారించిన ధర్మాసనం సుధీర్ఘ వాదనల అనంతరం సోమవారం తన తీర్పును వెలువరించింది. పురాతన భవనాల కూల్చివేతను తప్పుపడుతూ.. వాటిని కూల్చివేయవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, ఎర్రమంజిల్ లో మొత్తం 16 ఎకరాల స్థలంలో కొత్త అసెంబ్లీ భవనాన్ని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తోంది. దీని నిర్మాణం నిమిత్తం జూన్ 27న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. వచ్చే ఉగాది పండగ లోపు కొత్త అసెంబ్లీ నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఎర్రమంజిల్ భవనాల కూల్చివేతపై జూలై 3 నుంచి హైకోర్టులో పలు దఫాలుగా వాదనలు సాగుతోన్న విషయం తెలిసిందే. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ.. భవనాలను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవాటిని నిర్మించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కొత్త భవనం నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యతో తలెత్తడంతోపాటు పురాతన కట్టడాలను పరిరక్షించాల్సిన ప్రభుత్వ బాధ్యతను విస్మరించినట్టు అవుతుందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వీరి వాదనతో ఏకీభవించిన ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాన్ని తొసిపుచ్చింది. ఇదిలా వుండగా.. తాజా హైకోర్టు తీరుతో ప్రభుత్వ తదుపరి నిర్ణయంపై ఆసక్తినెలకొంది. దీనిపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తో వేచి చూడాలి. ఇకపోతే ప్రస్తుత అసెంబ్లీ భవనం పూర్తిగా అందుబాటులో ఉందని కూడా పిటిషనర్లు వాదించారు. వీరివాదనలను కూడా హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగా స్పందించాయి. వారసత్వ సంపదగా ఉన్నఈభవనం కూల్చివేయవద్దని ఆందోళనలు చేపట్టాయి.ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలుసంస్థలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. దీనిపై హైకోర్టు విచారణ జరిపి సోమవారం తీర్పువెలువరించింది.

## వచ్చే ఎన్నికల్లో పాండవులదే గెలుపు

**సిఎల్పీలో ఆసక్తికర చర్చ**

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): సీఎల్పీ కార్యాలయంలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్కతో పాటు జగ్గారెడ్డి, రాజగోపాల్ రెడ్డి మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాండవులదే విజయమని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ వచ్చినపుడు ఎంత సంతోషపడ్డానో, భట్టిని ప్రతిపక్ష హోదా నుంచి తీసేసినపుడు అంతే బాధపడ్డానని తెలిపారు. అంతేకాకుండా సమయం బాగాలేనప్పుడు పాండవులు అరణ్యవాసం చేశారని కూడా అన్నారు. అయితే పాత్రికేయులు కల్పించుకొని కాంగ్రెస్లో పాండవుల సంఖ్య కంటే నాయకుల సంఖ్య ఎక్కువ ఉందని అనగా, ఎమ్మెల్యే జగ్గారెడ్డి కల్పించుకొని ఆరో వ్యక్తి శ్రీకృష్ణుడని అన్నారు.

## క్యాన్సర్ ఆస్పత్రి అభివృద్ధికి ఎంతో కృషి

**కోడెల మృతి తీరని లోటన్న బాలకృష్ణ**

హైదరాబాద్,సెప్టెంబర్16 (ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మృతి పట్ల నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రప్రజలకు, పార్టీకి ఎంతో సేవ చేసిన వ్యక్తి ఆకస్మిక మరణం తనను షాక్కు గురి చేసిందన్నారు. కోడెల మరణం పార్టీకి తీరని లోటన్న బాలకృష్ణ... కోడెలను బతికించడానికి వైద్యులు ఎంతో ప్రయత్నించారని.. కానీ ఫలితం దక్కలేదని వాపోయారు. క్యాన్సర్ చికిత్స అభివృద్ధికి కోడెల ఎంతో కృషి చేశారని బాలయ్య గుర్తు చేసుకున్నారు. పోస్ట్మార్టం నివేదిక వస్తే కోడెల మరణం వెనక ఉన్న అసలు నిజాలు తెలుస్తాయన్నారు. సోమవారం ఉదయం 11.37గంటలకు కోడెలను ఆస్పత్రికి తీసుకువచ్చారని బసవతారకం మెడికల్ డైరెక్టర్ టీఎస్ రావు తెలిపారు. అప్పటికే ఆయన అపస్మారక స్థితిలో ఉన్నారని.. పల్స్ కూడా పడిపోయిందన్నారు. కోడెలను కాపాడేందుకు తమ వంతు ప్రయత్నం చేశామన్నారు. మధ్యాహ్నం 12.39గంటలకు కోడెల మరణించినట్లు? ధృవీకరించామన్నారు. అప్పుడే ఆయన ఆత్మహత్య చేసుకున్న ఆనవాలు గుర్తించామని.. దాంతో పోస్ట్మార్టం నిమిత్తం కోడెల మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలిచామని టీఎస్ రావు పేర్కొన్నారు.

# గరానా దొంగ అరెస్ట్: భారీగా చోరీ సొత్తు స్వాధీనం

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ):ఇళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ఘరానా దొంగను నగర పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఎర్రకుంట పరిధిలో అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని చూసి పెట్రోలింగ్ పోలీసులు ఆరా తీశారు. అనుమానితుడు సౌత్ జోన్ లోని చంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధి బండ్లగూడకు చెందిన మొహమ్మద్ సమీర్ (36)గా పోలీసులు గుర్తించారు. అతని నుండి 520 గ్రాముల బంగారం, 1040 గ్రాముల వెండితో పాటు విదేశీ కారెన్సీ, వన్ సోనీ ఎల్సిడి, వన్ స్క్రూడ్రైవర్ మరియు హామ్మర్ స్వాధీనం చేసుకుకున్నారు. మొత్తం రూ.25లక్షల నగదు వరకు రికవరీ చేసినట్టు పేర్కొన్నారు. గతంలో పలు కేసులలో జైలుకి వెళ్లివచ్చినా నిందితుడి ప్రవర్తన మారలేదని అన్నారు. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలను అమార్చుకోవలని సీపీ అంజనికుమార్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ రైతు విధానాలు

## అంతటా అమలు చేస్తే హరిత విప్లవం సాధ్యమే

నల్లగొండ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): తెలంగాణలో సిఎం కెసిఆర్ అనుసరిస్తున్న రైతు విధానాలను భారతదేశ వ్యాప్తంగా అమలు చేస్తే దేశంలో హరితవిప్లవం సాధించవచ్చని సూర్యాపేట జడ్పీ వైస్ ఛైర్మన్ , టిఆర్ఎస్ నేత గోపగాని నారాయణ అభిప్రాయపడ్డారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇవన్నీ సాకారం చేసుకునే దిశగా తెలంగాణ ఒక్కో అడుగు వేస్తున్నదని, వేసిన అడుగు విజయవంగా సాగుతున్నదని అన్నారు. రానున్న కాలంలో తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్గా నిలవబోతున్నదని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపిస్తున్న సిఎం కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయడమే ఓఓ కీలక నిర్ణయమని అన్నారు. ఇలా వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి, ప్రవేశపెట్టిన పథకాలు గురించి సీఎం కేసీఆర్ చేస్తున్నట్లుఅ దేశంలో ఎక్కడా సాగడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్వన్ రాష్ట్రంగా నిలిచిందన్నారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి బీమా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వం రూ.2,271 ప్రీమియం చెల్లిస్తున్నదని, ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందుతుందని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు సీఎం కేసీఆర్ను కొనియాడుతున్నాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు.ఎన్నడూలేని విధంగా పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నారని, పక్క రాష్ట్రాల్లో సరైన మద్దతు ధర లభించని రైతులు కూడా తెలంగాణకు వచ్చి అమ్ముకుంటున్నారని తెలిపారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్ధరణ జోరుగా సాగుతోందన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం కాబోదన్నారు. దేశంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అని పేర్కొన్నారు.

# మద్యం దుకాణాలపై వ్యాపారుల ఆసక్తి

**–లాభాలు వస్తాయన్న భావనలో ఎదురుచూపు**

కామారెడ్డి,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): మద్యం దుకాణాల టెండర్లకు గడువు సమీపిస్తుండడంతో జిల్లాలో సందడి మొదలైంది. దుకాణాలు చేజిక్కించుకునేందుకు ఆశావహులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో మద్యం లైసెన్సును చేజిక్కించుకునేందుకు భారీ పోటీ ఏర్పడనుంది. జిల్లాలో రెండేండ్ల కిందట జరిగిన వేలంలో 38 లైసెన్సులను దక్కించుకునేందుకు 450 మంది దరఖాస్తు చేశారు. ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష ఫీజు చెల్లించారు. ఈ లెక్కన ఆశావహుల దరఖాస్తు రుసుము ద్వారా సర్కారుకు రూ.4.50 కోట్లు ఆదాయం చేకూరింది.ఆబ్కారీ శాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ నెలాఖరుతో వైన్ షాపుల లైసెన్సుల గడువు ముగుస్తుండగా అక్టోబర్ ఒకటో తారీఖు నుంచి కొత్త లైసెన్సు విధానం అమల్లోకి రానుంది. ఈ మేరకు త్వరలోనే కొత్త లైసెన్సుల నోటిఫికేషన్ జారీ కానుంది. రెండేండ్లలో జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగాయి. 38 మద్యం దుకాణాల్లో మొత్తం రూ.600 కోట్ల మేర అమ్మకాలు జరిగినట్లుగా ఎక్సైజ్ అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మద్యం పాలసీ గడువు సమీపిస్తుండగా నోటిఫికేషన్ ఎప్పుడువి డుదలవుతుందోనని మద్యం వ్యాపారులు ఆశతో ఎదురు చూస్తున్నారు. పాలసీ విధానంలోని అంశాలపై ఆశావహుల్లో ఆసక్తి ఏర్పడింది. గత పాలసీలో జిల్లా కేంద్రంలోని దుకాణాలకు లైసెన్సు ఫీ జు రూ.55 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.45 లక్షలు చెల్లించే విధానం ఉండగా ఈ సారి కొంత మొత్తం పెంచే అవకాశం ఉందనే ఊహాగానాలు ఉన్నాయి.నూతన మద్యం పాలసీలో భారీ మార్పులు జరగబోతున్నాయని ప్రచారం సాగుతున్నది. 2017కు ముందు లైసెన్సు ఫీజుకు అదనంగా పర్మిట్ రూమ్కు రూ.లక్ష తీసుకునే విధానం ఉండగా ఇప్పుడు లైసెన్సు ఫీజులోనే కలిపారు. కొత్త విధానంలో పర్మిట్ రూమ్ ఉంటుందా? లేదంటే సపరేటుగా ఫీజు వసూలు చేసి అనుమతులు ఇస్తారా? అన్న ది తేలాల్సి ఉంది. దరఖాస్తు ఫీజు, లైసెన్సు రుసుము పెంచే అవకాశాన్ని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

జిల్లాల పునర్విభజన అనంతరం జరిగిన గత పాలసీలో పలు కొత్త మండలాలకు వైన్ షాపులు కేటాయించలేదు. ఈ సారి వీటి సంఖ్య పెరుగుతుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం మాత్రం కొత్త దుకాణాల పెంపుపై ఆసక్తి చూపడం లేదని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ పరిధి భారీగా విస్తరించింది. ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రాంతాలు సైతం మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయి. వీటిలో పలు గ్రామాలను విలీనం చేయడం ద్వారా మద్యం దుకాణాల సంఖ్య పెరుగుతుందేమోనని ఆశావహు లు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం పాలసీ 2017, అక్టోబర్ 1వ తారీఖున మొదలైంది. గత పాలసీకి గడువు సెప్టెంబర్ 30వ తేదీకి ముగిసి మరునాటి నుంచే కొత్త పాల సీ అమల్లోకి వస్తుంది.

క్రీడలు

# సత్తా చాటుతారా..



చాంగ్జౌ(చైనా) : ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించాక సన్మానాలు, ప్రశంసల వెల్లువతో తీరిక లేకుండా ఉన్న తెలుగు షట్లర్ పీవీ సింధు.. మరో టోర్నీకి సిద్ధమైంది. మంగళవారం ప్రారంభం కానున్న చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నమెంట్‌లో అడుగుపెట్టనుంది. చాంపియన్‌షిప్ తుదిపోరులో యమగూచిని ఓడించి పసిడిని పట్టిన సింధు.. మరోసారి అదే అద్భుత ప్రదర్శనతో చైనా టైటిల్‌ను సైతం కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మాజీ ఒలింపిక్ స్వర్ణ పతక విజేత లీ షిరూ(చైనా)తో సింధు బుధవారం తలపడనుంది. ప్రస్తుత ఫామ్ చూస్తే క్వార్టర్స్ వరకు సింధు అలవోకగా చేరుకునే అవకాశం ఉంది. అంతా అనుకున్నట్టు జరిగితే క్వార్టర్స్‌లో ఐదో సీడ్ సింధు... మూడో సీడ్ చెన్ యూఫీ(చైనా)తో తలపడాల్సి ఉంటుంది.

మరోవైపు స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ కూడా ఈ టోర్నీలో సత్తా చాటి ఫామ్‌లోకి రావాలని పట్టుదలగా ఉంది. ఈ ఏడాది ఇండోనేషియా మాస్టర్స్ గెలిచిన సైనా.. ఆ తర్వాత గాయం కారణంగా చాలా టోర్నీలకు దూరమైంది. అయితే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మంచి ప్రదర్శనే చేసినా.. క్వార్టర్స్‌లో అంపైర్ల వివాదాస్పద నిర్ణయాల కారణంగా ఓటమిని చవిచూసి ఇంటిబాట పట్టింది. తొలి రౌండ్‌లో బుసనన్ (థాయ్‌లాండ్)తో 8వ సీడ్ నెహ్వాల్ తలపడనుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం చరిత్ర సృష్టించిన సాయి ప్రణీత్ పై అందరి కండ్లు ఉన్నాయి. గాయం కారణంగా శ్రీకాంత్, డెంగీ వ్యాధితో ప్రణయ్ టోర్నీకి దూరమయ్యారు. మరోవైపు థాయ్‌లాండ్ ఓపెన్ టైటిల్‌తో మెరిసిన రాంకీ రెడ్డి, చిరాగ్ శెట్టి ద్వయానికి తోడు సుమిత్ రెడ్డి, మను అత్రి, సిక్కీ రెడ్డి, అశ్విని పొనప్ప పోటీలో ఉన్నారు.

# ప్రపంచ జిమ్నాస్టిక్స్‌కు అరుణా రెడ్డి



న్యూఢిల్లీ: ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టులో బుడ్డా అరుణారెడ్డి చోటు దక్కించుకుంది.

గతేడాది జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో కాంస్యం నెగ్గిన ఈ హైదరాబాదీ జిమ్నాస్ట్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటేందుకు గత కొంతకాలంగా విదేశాల్లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నది. అక్టోబర్ 4 నుంచి జర్మనీ వేదికగా జరిగే ఈ మెగాటోర్నీ కోసం ఆరుగురు జిమ్నాస్ట్‌లతో కూడిన బృందాన్ని ప్రకటించారు.

ఇందిరా గాంధీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో 18 మంది పురుష జిమ్నాస్ట్‌లు, 12 మంది మహిళా జిమ్నాస్ట్‌లు పాల్గొనగా.. అందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆరుగురిని పో టీలకు ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో ఆశీష్‌కు మార్, యోగేశ్వర్ సింగ్, ఆదిత్య సింగ్.. మహిళల విభాగంలో ప్రణతి నాయక్, ప్రణతి దాస్ బుడ్డా అరుణా రెడ్డి బరిలో దిగనున్నారు.

# గోదావరిలో కొనసాగుతున్న సహాయక చర్యలు

**- మూడోరోజు 18మృతదేహాలు లభ్యం**
**- దేవీపట్నం వద్దే 12మృతదేహాలు వెలికితీత**
**- మిగిలిన వారికోసం గాలింపు**
**- 315అడుగుల లోతులో బోటు**
**- వెలికితీసేందుకు కొనసాగుతున్న చర్యలు**

రాజమహేంద్రవరం, సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ) : మూడు రోజుల క్రితం గోదావరిలో గల్లంతైన మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతూనే ఉంది. వరుసగా మూడో రోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 18మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో మొత్తంగా 26 మృతదేహాలు బయటపడ్డాయి. ఇంకా గల్లంతైన 21 మందికోసం గాలింపు చర్యలను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా గలిస్తున్నాయి. మూడో రోజు వివిధ ప్రదేశాల్లో ఒక్కొక్కటిగా కొట్టుకొస్తున్నాయి. బోటు మునిగిన ప్రాంతంలోనే ఎక్కువగా తేలుతున్నాయి. కేవలం దేవీపట్నం వద్దే 12 మంది మృతులను గుర్తించారు.మరోవైపు మంగళవారం ఉదయం ధవళేశ్వరం బ్యారీ వద్దకు ఇద్దరి మృతదేహాలు కొట్టుకు వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలం కొత్త పట్టిసీమ వద్ద మరొక మృతదేహం లభ్యమైంది. మృతుడి జేబులో ఉన్న గుర్తింపు కార్డును పరిశీలించిన పోలీసులు, అతడిని హైదరాబాద్‌లోని మాదాపూర్ వాసి ఇ. సాయికుమార్‌గా గుర్తించారు. పోలవరం ఇసుక రేవు వద్ద ఒక మృతదేహం బయటపడగా.. కచ్చులూరు, ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద ఒక్కో మృతదేహాన్ని గుర్తించారు. తాళ్లపూడి వద్ద ఒకటి, ధవళేశ్వరం వద్ద మరో మృతదేహం లభ్యమైంది. 17వ నెంబరు గేటు వద్ద లభ్యమైన మృతదేహాన్ని బోటు ప్రమాద మృతుడిగా అధికారులు భావిస్తున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలాఉంటే ప్రమాదానికి గురైన బోటు 315 అడుగుల లోతులో ఉన్నట్లు గుర్తించారు. బోటు మునిగిన ప్రదేశంలో సుడిగుండాలు ఎక్కువగా ఉన్నందున సహాయక చర్యలకు తీవ్ర ప్రతికూలంగా మారిందని అధికారులు చెబుతున్నారు. సుడిగుండాలు, వరద ఉద్ధృతితో సహాయక బోట్లు నిలవలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికి 21మంది ఆచూకీ లభించలేదు. గల్లంతైన వారికోసం విస్తృతంగా గాలింపు చేపడుతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్ అధికారులతో సహా బ్యారేజీ వద్దకు చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధిత కుటుంబాలు ఆందోళన చెందవద్దని, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

# రైతు సంక్షేమమే కెసిఆర్ లక్ష్యం : కొత్త

మెదక్, సెప్టెంబర్17 (నేటినిజం ప్రతినిధి): రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు అమలు చేస్తుందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గొల్ల కుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ గొర్రె లు పంపిణీ చేశారన్నారు. అన్ని వర్గల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ సిద్దంగా ఉన్నారని వివరించారు.

తాను కష్టపడి గత ఐదేళ్లలో అనేక కార్యక్రమాలు చేశానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అడుకుంటున్న టీడీపీతో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకోని గత అసెంబ్లీ ప్రజలను మోసం చేయబోయినా ప్రజలు తిరస్కరించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 2009 ఎన్నికల్లో తండాలను గ్రామ పంచాయతీలుగా చేస్తామని ప్రకటించి ఎందుకు చేయలేదన్నారు. ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హామీ ఇవ్వకుండానే గిరిజన తండాలను గ్రామా పంచాయతీలుగా ఏర్పాటు చేశారన్నారు.

సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి బంగారు తెలంగాణ సాధన కోసం కృషి చేశారన్నారు. గోదావరి నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ లో నింపి అక్కడి నుంచి సింగూర్ ప్రాజెక్టులో తరలించి జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ రైతులకు సాగునీరు అందిస్తామన్నారు.

కశ్మీర్ ప్రశాంతంగా ఉంది

# ఒక్క బుల్లెట్ పేల్చలేదు.. ఒక్క ప్రాణం పోలేదు

**- మెరుపుదాడులు ప్రజలకు సంతోషం కలిగించి ఉండవచ్చు**
**- ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలంటే చాలా ధైర్యం కావాలి**
**- ఆ నిర్ణయంతో భారత్‌పై ప్రపంచ దేశాల వైఖరిలో మార్పు వచ్చింది**
**- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా**

న్యూఢిల్లీ, సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ) : జమ్మూకశ్మీర్‌లో పరిస్థితిపై ఎలాంటి ఆందోళనలు అవసరం లేదని, అక్కడంతా ప్రశాంతంగా ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడారు.. ఆగస్టు 5నుంచి ఇంతవరకూ అక్కడ ఒక్క బుల్లెట్ పేల్చలేదని, ఒక్క ప్రాణం కూడా పోలేదని అన్నారు. కశ్మీర్ ప్రశాంతంగా ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2016లో మెరుపుదాడులు (సర్జికల్ స్ట్రైక్స్) చేసినప్పుడు యాధాలాపంగా జరిగినట్టుగానే చాలామంది భావించారని, అయితే ఇటీవల 370 అధికరణ రద్దు తర్వాత దేశ రక్షణ విధానాలపై వారందరికీ చాలా స్పష్టత వచ్చిందని అమిత్‌షా అన్నారు. మెరుపుదాడులు, వాయిదాడులు ప్రజలకు సంతోషం కలిగించి ఉండవచ్చునీ, అయితే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలంటే మాత్రం చాలా ధైర్యం కావాలని అన్నారు. ఆ నిర్ణయం తర్వాత భారత్‌పై ప్రపంచ దేశాల వైఖరిలో మార్పు వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తూ, యూపీఏ హయాంలో ప్రతిరోజూ అవినీతి, సరిహద్దుల్లో అభద్రత, సైనికుల తలలు నరికివేత, మహిళలకు కొరవడిన రక్షణ, ప్రతిరోజూ రోడ్లపైకి జనం వచ్చి నిరసనలు తెలపడం వంటి వార్తలు చోటుచేసుకుంటూ ఉండేవని అమిత్‌షా విమర్శించారు. ప్రధాని ఒకరు ఉన్నప్పటికీ ఏ ఒక్కరూ ఆయనను ఖాతరు చేయకుండా తామే ప్రధానులుగా భావించుకుని పాలన సాగించారని కాంగ్రెస్ హయాంపై చురకలు వేశారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా మోదీ సర్కార్ ఓటు బ్యాంకును ఆశించకుండా ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటూవచ్చారని చెప్పారు. గత ప్రభుత్వానికి ఒక నిర్ణయం తీసుకునేందుకు 30ఏళ్లు పడితే, తమ ప్రభుత్వం గత ఐదేళ్లలో జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దు, వాయుదాడులు సహా 50కి పైగా కీలక నిర్ణయాలు తీసుకుందని షా చెప్పారు. ఆర్థికంగా భారత్ ఎదుగుతోందని, వ్యవసాయరంగం, తలసరి ఆదాయం కూడా పెరుగుతోందని, 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా పురోగమిస్తున్నామని అమిత్‌షా చెప్పారు. 2024 నాటికి ఆ లక్ష్యం సాధించి తీరుతామనే నమ్మకం తనకు ఉందని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు.

# దేశాభివృద్ధికి మోదీ ఎన్నో సంస్కరణలు తెచ్చారు

**- దేశ ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారు**
**- కేంద్ర హోంసహాయ మంత్రి కిషన్‌రెడ్డి**
**- ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ) : దేశ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రిలో స్వచ్ఛ భారత్ చేసి రోగులకు బ్రెడ్, పండ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇల్లు, కుటుంబం లేని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది మోదీనే అని అభినందించారు. వన్ నేషన్ వన్ ట్యాక్స్, వన్ నేషన్ వన్ గ్రిడ్‌లతో పాటు వన్ నేషన్ వన్ రాజ్యాంగాన్ని అమలు చేసి దేశ గతినే మార్చారని ప్రశంసించారు. 18వేల గ్రామాల్లో కరెంటు, 80శాతం స్టంట్ల ధరల తగ్గింపు వంటి చర్యలను మోదీ చేపట్టారని పేర్కొన్నారు. నేడు మోదీ జన్మదినంతో పాటు విశ్వకర్మ జయంతి, తెలంగాణకు స్వేచ్ఛా స్వాతంత్య్రం వచ్చిన రోజు ఇలా మూడూ కలిసి ఒకే రోజు రావడం శుభకరమన్నారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్ ప్రబలుతున్న దృష్ట్యా జిహెచ్ఎమ్‌సి వ్యర్థాలను తొలగించాలని కోరారు. డెంగీ జ్వరాల మీద రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలంటూ హైదరాబాద్ బ్రాండ్ను మనం కాపాడుకోవాలని కిషన్ రెడ్డి ప్రజలకు సూచించారు.

# మాయావతికి బిగ్ షాక్

**- ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి జంప్**
**- అశోక్ గహ్లోత్ పాలన నచ్చే వచ్చామన్న ఎమ్మెల్యే**
**- రాజస్థాన్‌లో 118చేరిన కాంగ్రెస్ బలం**

జైపూర్, సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ) : బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)కి రాజస్థాన్‌లో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

ఆ పార్టీకి చెందిన మొత్తం ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం సాయంత్రం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గత కొంత కాలంగా ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్‌తో టచ్‌లో ఉన్న బీఎస్పీ ఎమ్మెల్యేలు రాజేంద్ర గుడ్, జోగేంద్ర సింగ్ అవానా, వాజిబ్ అలీ, లఖాన్ సింగ్ మీనా, సందీప్ యాదవ్, దీప్‌చంద్ ఖేరియా మంగళవారం శాసన సభ స్పీకర్ సీపీ జోషిని కలిసి కాంగ్రెస్‌లో చేరాలన్న తమ నిర్ణయాన్ని తెలియజేశారు. దేశంలో పేట్రేగిపోతున్న అసాంఘిక శక్తులపై పోరాడటం, రాష్ట్ర అభివృద్ధి కోసమే తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అందుకు అశోక్ గహ్లోత్ నాయకత్వమే సరైనదని భావించి కాంగ్రెస్‌లో చేరామన్నారు. అభివృద్ధి కోసం ఓవైపు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతూనే మరోవైపు ఎన్నికల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 100 స్థానాలు, బీఎస్పీ ఆరు చోట్ల గెలిచింది. ఈ నేపథ్యంలో బీఎస్పీ ఆరుగురు ఎమ్మెల్యేలు, 12 మంది స్వతంత్ర శాసనసభ్యుల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గత మార్చిలో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలంతా ఆ పార్టీలో చేరారు. తాజాగా బీఎస్పీ సభ్యుల చేరికతో కాంగ్రెస్ బలం 118కి చేరింది. కర్ణాటకలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత బీజేపీ ఎక్కడ తమ రాష్ట్రంపై దృష్టి పెడుతుందోనని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ఆందోళన చెందారు. తన రాజకీయ వ్యూహాలతో బీఎస్పీ ఎమ్మెల్యేలను ఆకర్షించి, కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్నారు. కమ్యూనల్ కుట్రలను నిలువరించి, రాష్ట్రంలో అభివృద్ధిని కొనసాగించాలన్న ఉద్దేశంతోనే తాము పార్టీ మారినట్లు వారు చెప్పారు. అశోక్ గెహ్లాట్ రాజస్థాన్ కు దొరికిన గొప్ప ముఖ్యమంత్రి అని, ఆయనకు మించిన వారెవరూ లేరని, ఆయన పాలసీలు నచ్చి ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

సినిమా

# 'వరల్డ్ ఫేమస్ లవర్'గా విజయ్ దేవరకొండ



డియర్ కామ్రేడ్ సినిమాతో నిరాశపరిచిన సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నాడు. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో ఓ సినిమాతో పాటు తమిళ దర్శకుడు ఆనంద్ అన్నామలై దర్శకత్వంలో హీరో సినిమాల్లో నటిస్తున్నాడు. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న క్రాంతి మాధవ్ సినిమాకు చాలా కాలంగా షూటింగ్ జరుపుకుంటోంది.

తాజాగా ఈ సినిమాను ప్రమోషన్ కార్యక్రమాలు ప్రారంభించారు చిత్రయూనిట్. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'వరల్డ్ ఫేమస్ లవర్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్‌పై వల్లభ నిర్మిస్తున్న ఈ సినిమాలో రాశీఖన్నా, ఐశ్వర్యా రాజేష్, కేథరిన్ థ్రెస్సా, ఇసాబె÷-లలెలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. గోపి సుందర్ సంగీతమందిస్తున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సెప్టెంబర్ 20న రిలీజ్ చేయనున్నారు.

# తమిళ మూవీకి రీమేక్‌గా బాఘీ 3..!

÷రిళిజు రోజుకి సౌత్ సినిమాల స్థాయి మరింత పెరుగుతుండడంతో హిందీ పరిశ్రమకి సంబంధించిన మేకర్స్ మన సినిమాలని రీమేక్ చేస్తూ మంచి విజయాలు సాధిస్తున్నారు. బాఘీ ఫ్రాంచైజ్‌లో వచ్చిన గత రెండు చిత్రాలు తెలుగు రీమేక్ చిత్రాలుగా తెరకెక్కి మంచి హిట్ కొట్టాయి . వర్షం సినిమాకి రీమేక్ గా హిందీలో తెరకెక్కిన బాఘి చిత్రం మంచి విజయం సాధించడంతో ఈ మూవీకి సీక్వెల్‌గా బాఘీ2 చిత్రాన్ని తీసారు. ఇది తెలుగు సినిమా క్షణంకి రీమేక్‌గా రూపొందింది. అహ్మద్ ఖాన్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ దక్కించుకుంది . ఇక ఇప్పుడు బాఘీ 3 కూడా ఎ÷-లాన్ చేశారు .ఇందులోను టైగర్ ష్రాఫ్ కథానాయకుడిగా నటించనుండగా, శ్రద్దా కపూర్ కథానాయికగా నటిస్తుంది.

అహ్మద్ ఖాన్ దర్శకత్వంలో మూడో పార్ట్ తెరకెక్కుతుండగా, సాజిద్ నడియావాలా చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. 2020 మార్చి 6న మూడో పార్ట్ విడుదల కానుంది. ఇటీవల సెట్స్ పైకి వెళ్ళిన ఈ చిత్రం ఏడు రోజుల పాటు తొలి షెడ్యూల్ జరుపుకోనుండగా, సెర్బియా, జార్జియాలో తర్వాతి షెడ్యూల్ మొదలు పెట్టనున్నారట. అక్టోబర్‌లో ÷-లకైమాక్స్‌కి సంబంధించిన షూటింగ్‌ని ఆ ప్రాంతాలలో జరపనున్నారు. తాజాగా చిత్రానికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. బాఘీ 3 చిత్రం తమిళ సూపర్ హిట్ చిత్రం వె÷-ట్టైకి రీమేక్‌గా రూపొందనుందని అంటున్నారు. తమిళంలో ఆర్ మాధవన్, ఆర్య ప్రధాన పాత్రలలో చిత్రం రూపొందగా, 2012లో సినిమా విడుదల అయింది. మరి తాజాగా వస్తున్న వార్తలలో నిజమెంత ఉందనేది తెలియాల్సి ఉంది.

# మోదీ బయోపిక్.. ఫస్ట్ లుక్ విడుదల




ప్రస్తుతం బాలీవుడ్‌లో బయోపిక్‌లో ట్రెండ్ నడుస్తుంది. ఆ మధ్య ప్రధాని నరేంద్రమోదీ జీవిత నేపథ్యంలో బయోపిక్ రూపొందించారు. నేషనల్ అవార్డ్ విన్నర్ ఒమంగ్ కుమార్ తెరకెక్కించిన చిత్రం పీఎం నరేంద్రమోదీ పేరుతో విడుదలై డివైడ్ టాక్ తెచ్చుకుంది. మోదీ పాత్రలో వివేక్ ఒబేరాయ్ కనిపించారు. ఇక ఇప్పుడు మోదీ చరిత్రను ప్రతీ ఒక్కరికీ తెలిసే విధంగా సంజయ్ లీలా భన్సాలీ సన్నాహాలు చేస్తున్నాడు. 'మన్ బైరాగీ' అనే టైటిల్‌తో ఈ సినిమాని విడుదల చేయనున్నాడు. తెలుగులో ఈ చిత్రం మనో విరాగి పేరుతో రిలీజ్ కానుంది.ప్రధాని మోదీ జీవితానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎవరికీ తెలియని విషయాలను'మన్ బైరాగీ' సినిమాలో చూపించనుండగా, తాజాగా చిత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫస్ట్ లుక్ రివీల్ చేశాడు. అక్షయ్ కుమార్ తన ట్విట్టర్ లో పోస్టర్ షేర్ చేశాడు. పోస్టర్ అభిమానులని ఎంతగానో ఆకట్టుకుంటుంది. సంజయ్ లీలా భన్సాలీ మరియు మహావీర్ జైన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ

చిత్రానికి సంజయ్ త్రిపాఠి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రధాని యువకుడిగా ఉన్న సమయంలో ఆయన జీవితంలో జరిగిన ముఖ్య మలుపు ఏంటనేది ఈ చిత్రంలో చూపించనున్నట్టు తెలుస్తుంది.

# గుజరాత్‌లో పర్యటిస్తున్న మోడీ

## నర్మదా నదికి ప్రత్యేక పూజలు

అహ్మదాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): ప్రధాని మోడీ స్వ




గుజరాత్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ నర్మదా నది ఉధృతిని పరిశీలిస్తున్న దృశ్యం

రాష్ట్రం గుజరాత్ లో పర్యటిసున్నారు. కెవడియాలోని సర్దార్ సరోవర్ డ్యామ్‌ను సందర్శించిన మోడీ నమామి దేవి నర్మద మహోత్సవ్ లో భాగంగా నర్మదా నదికి ప్రత్యేక పూజలు చేశారు. కాక్టస్ గార్డెన్, బట్టర్ ఫ్లై గార్డెన్లను పరిశీలించిన మోడీ.. సీతాకోక చిలుకలను ఎగురవేస్తూ సందడి చేశారు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీని సందర్శించి సర్దార్ పటేల్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని వెంట గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ, గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్ పాల్గొన్నారు. పుట్టినరోజు సందర్భంగా మోడీ తల్లి హీరాబెన్‌ను కలుసుకుని ఆమె ఆశీస్సులు తీసుకోనున్నారు. ధాని నరేంద్ర మోడీ 69వ జన్మదినోత్సం జరుపుకుంటున్నారు. మోడీ పుట్టినరోజు సందర్భంగా దేశవా ్యప్తంగా స్వచ్ఛతా సేవా కార్యక్రవ ాలు నిర్వహిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రధాని మోడీ గుజరాత్ లో పర్యటిస్తు న్నారు. నర్మదా జిల్లాలోని కెవదియాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారం భించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతిని ప్రధాని సమీక్షించారు. నర్మదా నదీ తీరంలో పూజ లు చేశారు. సర్దార్ సరోవర్ డ్యాం కంట్రోల్ రూమ్‌ను సందరి ్శంచారు.

## యురేనియం తవ్వకాలకు..

# కాంగ్రెస్, తెరాసలు అనుమతులిచ్చాయి

- ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో మాటమారుస్తున్నారు
- కోడెల మృతిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలి
- కేంద్ర సహాయమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ) : యురేనియం తవ్వకాలకు కాంగ్రెస్, తెరాస ప్రభుత్వాలు అనుమతులిచ్చాయని, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో మాటమారుస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. యురేనియం తవ్వకాలకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం, 2016లో తెరాస ప్రభుత్వం అనుమతిచ్చిందని తెలిపారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో మాట మారుస్తున్నారని ఆరోపించారు. ఖనిజ సంపద, నిక్షేపాలు ఉన్న చోట కేంద్రం పరిశోధనలు చేస్తోందన్నారు. కానీ, యురేనియం తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, తెరాస నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అప్పుడు అనుమతులిచ్చి ఇప్పుడు ఉద్యమాలు అనడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ ప్రజా వ్యతిరేఖ పాలన సాగిస్తున్నాడని, ప్రజలను మోసం చేస్తూ తన వగ్బం గడుపుకుంటున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలు ఒకపక్క ఇబ్బందులు పడుతుంటే కేసీఆర్‌కు రాజకీయాలే ముఖ్యమన్నట్లు వ్యవహరిస్తున్నాడని అన్నారు. తెరాసకు ప్రత్యామ్నాయం బీజేపీనేనని రాబోయే కాలంలో రాష్ట్రంలో బలమైన పార్టీ బీజేపీ ఎదుగుతుందని అన్నారు. 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధిస్తే తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న విముక్తి కలిగిందని అన్నారు. కోడెల ఆత్మహత్య చేసుకోవడం విషాదమని, ఏ రాజకీయ కుటుంబంలో ఇటువంటి ఘటనలు జరగరాదన్నారు. కోడెల ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. ఈ సంఘటనపై డీజీపీ, సీఎస్‌తో మాట్లాడి నివేదిక అడుగుతానని కిషన్ రెడ్డి తెలిపారు.

## ఆటోబోల్తా: విద్యార్థులకు గాయాలు

హైదరాబాద్,సెప్టెంబర్17( ఆర్ఎన్ఎ): నగరంలోని నాంపల్లిలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా పడడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో బొగ్గుల కుంటలోని ఆదిత్య ఆస్పత్రికి తరలించారు. ఓ బాలుడు యాక్టివాపై వేగంగా వెళుతూ ఆటోను ఢీకొట్టాడు. యాక్టివాను తప్పించబోయేందుకు డ్రైవర్ యత్నించిన క్రమంలో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. గాయపడిన విద్యార్థులు అబిడ్స్ గ్రామర్ పాఠశాలలో చదువుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## తెలంగాణ భవన్‌లో జెండా ఎగురేసిన కెటిఆర్

### అమరుల త్యాగాలను స్మరించుకున్నామని ట్వీట్

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): సెప్టెంబర్ 17 తెలంగాణ విమోన దినోత్సవాన్ని పురస్కరించుకొని.. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరించారు.నైజాం వ్యతిరేక పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కెటిఆర్ పేర్కొన్నారు. భారత యూనియన్ లో హైదరాబాద్ సంస్థానం విలీనమైన సెప్టెంబర్ 17ను పురష్కరించుకుని కెటిఆర్ తెలంగాణ భవన్ లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెటిఆర్ ట్వీట్ చేశారు. నాటి నైజాం వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఎందరో తెలంగాణ వీరులు అమరులయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమరవీరులకు నివాళులు అర్పించారు

## కేసీఆర్ పాలన..

# నిజాం పాలనను తలపిస్తుంది

- నిజాం ఆగడాలు విన్నాం.. ఇప్పుడు స్వయంగా చూస్తున్నాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్
- కేసీఆర్ కారుపై మజ్లీస్ సవారీ చేస్తుంది
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- బీజేపీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవం
- పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ సీహెచ్

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ) : కేసీఆర్ పాలనను చూస్తుంటే నిజాం పాలనను తలపిస్తుందని, గతంలో నిజాం పాలనను విన్నామని, ఇప్పుడు స్వయంగా చూడాల్సి వస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ టీఆర్ఎస్‌ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ పతాకం ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తేనే విమోచన దినోత్సవం అధికారకంగా నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు. సెప్టెంబర్ 17న తిరంగా యాత్ర నిర్వహించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు. ఈ క్రమంలో ఊరి నిండా జాతీయ జెండా నినాదంతో.. ప్లలె ప్లలెలో జాతీయ పతాకాలు ఎగురవేస్తున్నామని లక్ష్మణ్ పేర్కొన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో విమోచన దినోత్సవ వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని విమర్శించారు. యాదాద్రిపై కేసీఆర్ బొమ్మ చెక్కించుకున్నారని, నిజాం ఆగడాలు విన్నామని, ఇప్పుడు చూస్తున్నామని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అనంతరం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. సర్దార్ వల్లభబాయ్ పటేల్ దూరదృష్టితో తెలంగాణ కు విమోచనం లభించిందని అన్నారు. హైదరాబాద్ విలీన అంశాన్ని పటేల్ డీల్ చేసి విముక్తి కల్పించారు. కశ్మీర్‌ను అంశాన్ని డీల్ చేసిన నెహ్రూ 370 ఆర్టికల్ పేరుతో ఆ ప్రాంతాన్ని సమస్యాత్మకంగా మార్చారు. నేడు ప్రధాని మోదీ, అమిత్ షా చొరవతో కశ్మీర్ సమస్య పరిష్కారమైంది. 370 ఆర్టికల్ రద్దు అయ్యింది అని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలోకేసీఆర్ కారుపై మజ్లీస్ సవారీ చేస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. 'కారు రిమోట్ మజ్లీస్ చేతిలో ఉంది. రాజు గారి కుక్క చనిపోతే డాక్టరును సస్పెండ్ చేస్తారుకాని, మనుషుల ప్రాణాలంటే కేసీఆర్‌కు లెక్కలేదని ఘాటుగా విమర్శించారు.

# విమోచనను విస్మరించిన కెసిఆర్

## గుణపాఠం తప్పదు :ప్రభాకర్

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందని బీజేపీ నేత,మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ ప్రభాకర్ ఆరోపించారు. అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి కేసీఆర్ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని మరిచారని అన్నారు. బిజెపి కార్యాలయంలో జరిగిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం ఎంఐఎంకు తలొగ్గి చరిత్రను అవమానించడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం ఎంఐఎంకు తలొగ్గి తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరిచారని విమర్శించారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిన తెలంగాణ ప్రజలకు సెప్టెంబర్-17న నిజమైన స్వాతంత్ర్యం వచ్చిన రోజని అన్నారు .కేవలం ఓటు బ్యాంకు కోసమే కేసీఆర్ విమోచన దినాన్ని నిర్వహించడం లేదని అన్నారు. భారతలో హైదరాబాద్ స్టేట్ విలీనం తర్వాత దేశముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేశామంటున్న కమ్యూనిస్టులు.. అది స్వాతంత్ర్య పోరాటం ఎలా అవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాం వ్యతిరేక పోరాటం జరిపామంటున్న కమ్యూనిస్టులు, నిజాం పాలన లేని కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ పోరాటాన్ని ఎందుకు కొనసాగించారో చెప్పాలన్నారు. హైదరాబాద్ స్టేట్ విలీనం తర్వాత కూడా ఎందుకు పోరాటాన్ని కొనసాగించారనే దానిపై కమ్యూనిస్టుల వద్ద సమాధానం లేదన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.